
తుహిన కణాలు
ఉమ

# తుహిన కణాలు

ఉమ

# తుహిన కణాలు

రచన: **ఉమ**

© **ఉమ**

చిరునామా:
**Dr. Uma Eyyunni**
2306, Westview Terrace,
Martins Burg, West Virginia,
2501. U.S.A.

**Price: ₹ 100/-**
**$ 5**

ముఖచిత్రం: **NARSIM**

D.T.P.:
**V. Asha Rani**
Musheerabad, Hyderabad.
Ph: 868 664 5226.

Printed at:
**JAGAPATHI PRINTERS**
Himayat Nagar, Hyderabad.
Ph: 040-27638728.

# అంకితం



అమ్మ - నాన్నగార్లకి,
నేస్తానికి, కలల నెచ్చెలికి,
చిన్ననాటి చెలిమికి
నిజ జీవన సహచరికి
(ర)సహృదయులకి

**- ఉమ**

# అభినందన

పచ్చని ఆకులపైన తళతళ మెరిసే మంచు బిందువులు కళ్లకు విందులు చేస్తాయి. ప్రకృతిని ప్రతిబింబించే పదబంధాలు మనసులను పులకింపజేస్తాయి. ఈ **తుహిన కణాలు** అలాంటి పదబంధాలే.

డా. ఉమ భావకవిత్వ స్పర్శతో అప్పుడప్పుడు రచించిన కృతులివి. కొన్ని వచనతుల్యంగా సాగిపోతే, మరికొన్ని పద్య గేయ గంధులుగా సుతారంగా ఊగిపోతాయి. ఈ కవితా సంపుటిలోని రచనల్లో గణనీయ వైవిధ్యముంది. ప్రణయం, ప్రణవం, ఆరాధన, ఆవేదన ఇలా ఎన్నెన్నో పార్శ్వాలు ఈ సంపుటిలో కనిపిస్తాయి. తియ్యని ఊర్పులా ప్రసరించే లలిత పదాల కూర్పు ఈ సంపుటిలోని కవితల్లో అడుగడుగునా కనిపిస్తాయి.

అమెరికాలో స్థిరపడినా తెలుగుపట్ల మమకారం సన్నగిల్లిపోకుండా అందమైన ఆ తెలుగులో కవితా రచన చేసిన డా. ఎస్. ఉమకు నా అభినందన.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
**డాక్టర్ సి. నారాయణరెడ్డి**
ఎం.పి.

అధ్యక్షులు
**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి**

# కితాబు

జనన మరణాలతో పోరాడుతూ, బాధాతప్త రోగుల కన్నీరు తుడిచే డాక్టర్ ఉమ కలం పట్టుకున్నపుడు ఆ కలం నుంచి నివేదన, ఆరాధన, అన్వేషణ, మమతా స్నేహాలు జాలువారాయి. మూడు దశాబ్దాలుగా ఆమె హృదయంలో బంధీ అయిన అక్షర తపన – **తుహిన కణాలు** కవితా సంపుటిగా వెలువడినాయి. **తుహిన కణాలు** చూడగానే నా మదిలో కృష్ణశాస్త్రి గారి పదమాధుర్యం 'చవితహిమాని' – 'లలిత తుషారం' అన్న పదాలు మెరిశాయి. ఆ మహాకవి సరసన **తుహిన కణాలు** నా స్మృతిలో కదలాడాయి అంటే అంతకు మించిన గొప్ప కితాబు ఇంకేముంటుంది? డాక్టర్ ఉమ అక్షర తపస్సు ఇంకా ఇంకా కొనసాగాలని ఆకాంక్షిస్తూ....

*– మాలతీ చందూర్*

# ముందుమాట

ఎంకి పాటల సుబ్బారావు ఆనాడు, ఇంటి (ENT) పాటల డా. ఉమ ఈనాడు డా. ఉమ చెవి, ముక్కు, గొంతు నిపుణులు. ఈ మూడు మానవుని రసానుభూతికి అత్యావశ్యకం. శ్రవణోపేయం చేసేది చెవి, ఎదను తట్టి లేపేది గొంతు, మందార పరిమళాల సుగంధాలనందించేది నాసిక. అందుకేనేమో డా. ఉమ కవయిత్రి కూడా అయ్యారు. ఆమెకు లక్ష్మీ సరస్వతి, పార్వతీ కటాక్షాలు కలిగాయి. ఆమె గాయని, కవయిత్రి, పోషకి. ఆమెను మొదటిసారి 1994లో అమెరికాలో మా అల్లుడు చి. హరిమోహన్ పినతల్లిగా చూశాను. మళ్లీ ఈ దశాబ్దపు అంచులో కళామతల్లిగా కనుగొన్నాను. ప్రతిప్రజ్ఞావంతుడైన పురుషుని వెనుక ఒక స్త్రీ ఉంటుందంటారు. ఈ ప్రతిభాశాలి వెనుక ఆమె భర్త రామానుజం కాదు, డా. రామానుజం ఉన్నారు.

వీరి శ్రేయ సుమాల్లో మనకు కనిపిస్తుంది, వినిపిస్తుంది. ఆర్ద్రత, అన్వేషణ, నిరీక్షణ, ఆవేదన, ఒక క్షణం అభిసారిక, మరో క్షణం విరహిణి, ఒక నిమిషం గోపిక, మరో నిమిషం శబరి, యమునా తటిపై రావు, గోదావరి గట్టున పల్లెపిల్ల ప్రత్యక్షమౌతారు. వీరి పదాల సవ్వడులు వారి నాయికల పాదాల సిరిమువ్వల గలగలలకు తగినవే. ఒకచోట వలపు చినుకు చినికి మరోచోట నిన్న రేతిరికాడ వానజల్లు కురుస్తుంది. ఇంకోచోట గిరిరాజ తనయ చిరునవ్వు రవ్వయై చెణకి రజతగిరి విరించినవేళ అవుతుంది.

వీరి గేయ సుమాలు స్వరపేటికలో పేరుస్తూ సమస్త ఆంధ్ర లోకానికి అందిస్తారని ఆశిద్దాం. ఈమె స్టెతస్కోపు మరెన్నో గుండెలోతులు పరిశీలిస్తూ అంత పని కల్పిస్తారని ఆశిస్తూ...

*– బి.ఎస్. శాస్త్రి*

*ఐ.పి.ఎస్., డి.జి.పి., కేరళ*

# తొలి పలుకు

ఏదో ఒక దశలో స్థిమితంగా కూర్చుని గడిచిన జీవిత గమనాన్ని వెనుతిరిగి చూసుకోవడం సహజం. ఆలోచనలను అక్షరాలుగా మార్చాలన్న నిరంతర తపన, ఆర్ద్రత, సౌజన్యం మూర్తీభవించిన వ్యక్తిత్వం తొణికిసలాడే పంక్తులు – ఈ కవిత్వంలోని పదాలు.

ఈ అక్షర క్రమం మనిషి ఆలోచనల స్థాయిని, మలచి, పెంచి రసానుభూతిలో ఓలలాడించి భౌతికావస్థ నుండి అచేతన దశకు తీసుకుపోతుంది.

దాదాపు 3 దశాబ్దాల ఆలోచనలకు దర్పణం పట్టే ఈ కవితా ఖండికల్లో భావంతో, వస్తువుతో సాయుజ్యం పొందాలన్న కోరిక, ఆర్తి స్పష్టంగా గోచరిస్తాయి. అయితే ఆలోచనలోని అసంతృప్తి భావంలోకి రానీయకుండా కౌమార యౌవన దశల ఉద్విగ్నతను, వానప్రస్థంలోని నిశ్చల మంద్రపుటాలోచనతో జీవితాన్ని కవితనూ పరికించే దశలో అనేక వత్సరాల ఉద్వేగాన్ని అక్షర రూపంలో ఒకేచోట చూడగలగడం ఒక మంచి అవకాశం.

'అస్తిత్వమే లేని ఆకృతు'లను **తుహిన కణాల** రంగవల్లుల్లో రమ్యంగా తీర్చిదిద్దిన కవయిత్రిలో నిరీహతకంటే మమతానుబంధాలను ఏదో విధంగా మనస్సు నుండి కాలపు పొరలనధిగమించి వెలదీయాలన్న పట్టుదల కానవస్తుంది. ఉనికికి సంబంధించిన ఓ తాత్త్విక ప్రస్తావనను 'సంధ్య చెరగు' జార్చి 'బాలభానుడి నునులేత కిరణాలతో అలికించటం' గడుసుదనమేమో! వాచ్యంగా గోచరించే నిరీహిత ఊహల సంభ్రమపు ఇంద్రధనస్సులో మునిగిపోయింది.

'నిన్న నేడుల రాగజలధులు భావబంధాలై ఎగసినవేళ చిన్నబోనీకు / నీ వింత మనసుకి' అన్న భావంలో నిర్దుష్టంగా పై విషయం ద్యోతకమౌతుంది.

'వెలుగు నీడల మిశ్రమంలో ఆరి వెలిగే వలపు తలపులు గత స్మృతుల మాధుర్యాలు కలసి, కరిగి కనుపాపల కౌగిలిస్తే కదలి జారిన కన్నీటి బిందువు చెక్కిట ముత్యమై నిలచి మెరిసింది.'

అనేక పర్యాయాలు పరిత ఒక నిజమైన భ్రాంతిలో పడతాడు. కవయిత్రి చెప్పదలచుకొన్న విషయం దార్శనికమ– భౌతికమా – లేక రెండూనా! మనుగడను గూర్చిన గంభీరమైన ఆలోచనలతో మొదలైన కవిత ముందుకు సాగి 'జలధులు పొంగించి, ముత్యాలు కూర్చి కిరణాలు చిందించి భావబంధాల ఎగచిమ్మటం' నిజంగా విశిష్టం. సౌజన్యంతో మమతలు పొంగించే వ్యక్తిత్వాన్ని తార్కికపుటాలోచనలు ఏమాత్రం బంధించలేవన్న విషయం బలీయంగా అంతర్లీన గమనం ద్వారా అనేక ఖండికల్లో తేటతెల్లమౌతుంది.

*'లేలేత వెలుగులో రేకు విరిసిన రెల్లుపూలు*
*ఊగూగి నీ రాక నా తలపుకెరిగించె*
*మనసు అంచులకావలెనె నిలిచి*
*పలుకరించి అలవోకగా కదలిపోయిన సఖుడ'*

పై కవితలో రెల్లు పూవు ప్రకంపనలకి అలవోకగా కదలిపోయిన వ్యక్తి ఉనికితో పోల్చటం మనోజ్ఞం. అయితే ఒకటి కేవలం కదలిక – రెండోది గమనం!

*'మోవినంటిన మురళి మురిసి నవ్వంగ*
*పెదవి వీడిన పలుకు ప్రణవ నాదమ్మాయె'*

అన్న వ్యక్తీకరణలో మురళీరవాల్లో ప్రణవనాదాన్ని గమనిస్తున్న దృక్పథం. అయితే వెంటనే వెలుగు కన్నెలు నర్తించడం / పుడమి పులకించి వెన్నెల వాగులు దోపడ్డటం – కైలాససిరి శిఖరాల అనుభూతిలో ఓలలాడుతున్న మనోదృశ్యానికి – అస్తిత్వపు ప్రతీకలు హరివిల్లు రంగులు చూపడం – రెంటిలో ఏది శాశ్వతం?

మమత అనే ఖండికలో 'రూపునెరుగని మమతల మూర్తియతడు / రూపు కోరని మార్దవ్యపు మొలక ఆమె' అన్న దశలో 'భావనా మాధురీ ఝరిలో బాంధవ్య మధురిమల' శోధన సాగి 'ఆత్మైక రూపమౌ అనురాగ జలధులు' అని సంబరపడి 'ఎగసి కల్లోలపరచే భావతరంగాలు / సైకత స్థలి కలసి కరిగిపోయే తలపు నురగలు / జీవితంపు లోతుల విరిసి కలసిపోయిన మెరుగులు' అన్న సమాధానం గోచరమౌతుంది.

జీవిత గమనంలో ముఖ్యంగా రెండు దశల్లో వ్రాయబడ్డ ఈ కవితల్లో చాలా స్పష్టంగా కానవచ్చే విషయం – అంతర్గతమైన లయ. మొదటి దశలో దృక్పథానికి మచ్చుతునక 'వాన'.

‘నింగీ నీలాల మబ్బు తునకలు ఒకటితో ఒకటి సరాగమాడినట్లు మెరుపు తీవల నవ్వులొలికించినటుల ఉత్సాహం, ఉరకెత్తి, ఉరిమి, జడిపించి నటుల’

*‘ముత్యాల చినుకుల వాన*
*జలతారు మెరుపుల వాన’*

ఇటువంటి రమ్యమైన రంగుల రాగాల నుండి కన్నీటి ముత్యాల సరాలవేపు / గరిక చివుళ్ల మెరిసే తుహినకణాలవేపు సాగిన కవితా హృదయంలో అలవోకగా నినదించే మానవత్వపు సంగీతం మాటలు జ్ఞాపకం వస్తాయి.

తొలి పలుకులో ఇంతకంటే ఏం చెప్పను? ‘బాధే సౌఖ్యమనే భావన’ ఆ ఎరుకే నిశ్చలానంద’మని తృప్తిపడకుండా ‘రేపు వచ్చే వెలుగు రేఖలు / తలపు తట్టీ, మనసునంటీ / విశ్వమంతా వెలుగుమయమై’ కలిపి నింపుతానన్న కవి హృదయం తెలుసుకోవడానికి ఇంతకు మించిన ప్రస్తావన అవసరంలేదు.

*– డి. చక్రపాణి*
*ఐ.ఎ.ఎస్., హైదరాబాద్*

# మళ్ళీ గళం సవరించిన కోయిల

**డా.** ఉమతో నా సాహితీ బాంధవ్యం కాలేజీల్లో చదువుకొనే కాలంనాటిది. ఆ రోజుల్లోనే ఉమ కవిత్వంలో అనుభూతిని సూటిగా అందించే విస్పష్టమైన అభివ్యక్తి, సలక్షణమైన భాష, భావంలో, శైలిలో అనుకరణకు తావులేని స్వతంత్ర్య రీతి ప్రస్ఫుటంగా గోచరించేవి. ఆనాటి మా ఔత్సాహిక కవి బృందంలో నేటిదాకా సాహిత్యమే ఉఛ్ఛ్వాస నిశ్వాసలుగా బ్రతుకుతున్నవాళ్ళు నాలాంటి ఒకరో ఇద్దరో అనే మాట వాస్తవం.

డా. ఉమ అమెరికాలో స్థిరపడిన తర్వాత ఆమె కవిత్వం కూడా మరుగునపడిపోయిందనుకున్నాను. మాజీ కవయిత్రి అనుకున్నాను. మళ్ళీ దాదాపు మూడు దశాబ్దాల తర్వాత **తుహిన కణాలు** ద్వారా ఆర్ద్రమైన, అనుభూతి రమ్యమైన కవిత్వాన్ని అందించి ఉమ ఆశ్చర్యంలో ముంచెత్తింది. అంకురప్రాయంగా ఉన్న సాహిత్య సృజనాసక్తి నేడు వృక్షంగా పరిణమించి పరిఢవిల్లింది. ఆ కొమ్మల్లో దాగి మళ్ళీ గళం సవరించిన కోయిల స్వరాలే **తుహిన కణాలు.** ఈ సంకలనాన్ని ఎడిట్ చేసి ప్రచురణను పర్యవేక్షించే బాధ్యత మిత్రుడు చక్రపాణి ద్వారా నాకు లభించడం గొప్ప స్నేహానుభూతి.

డా. ఉమ బహుముఖీనమైన భావజాలం స్వదేశాంధ్రుల, ప్రవాసాంధ్రుల హృదయాలకు సన్నిహితం కాగలదని నా విశ్వాసం.

ఇంతటి సుదీర్ఘ వ్యవధానం తరువాత అలనాటి మిత్రురాలి కవిత్వం మళ్ళీ పలకరించింది... నిజమే.. కవిత్వమొక తీరని దాహం.

*– వై రామకృష్ణారావు (ఎల్లాప్రెగడ)*
*ఎమ్.ఎ., ఎమ్.ఫిల్., పి.జి.డి.ఎ.ఎల్.,*
*లెక్చరర్, చైతన్య కళాశాల, హైదరాబాదు.*

# తుహిన కణాలు

## చాలా టచింగ్‌గా ఉంది

ఉమ గారికి నా అభినందనలు తెలపండి. వృత్తిరీత్యా తీరిక లేకుండా పనిలో నిమగ్నమై ఉంటూనే మనోవీధిలో సుందర తీరాల్లో విహరించే ఆమె కవితాత్మకు ఆశ్చర్యపోయాను. హృదయానుభూతులను ఇంత సన్నిహితంగా వీక్షించి, స్పృశించి వాటికి సున్నితమైన భాషాపరిమళాన్ని అద్ది, పూలతీగల్లా పాఠకుల ముందు పరిచారు. మృదువైన ఆమె ఆలోచనారీతులకు, ఆర్ద్రతగల స్పందనా శక్తికి మళ్లీ అభినందనలు తెలుపుతున్నాను. నాకు తెలుసు – మీలోనూ ఇదేవిధమైన సెన్సిటివిటీ ఉండటంవల్లనే, ఇంతగా శ్రమించిన ఈ పుస్తకాన్ని ఇంత అందంగా తయారు చేయించారు. మీ ఇద్దరికీ మా శుభాకాంక్షలు.

స్నేహంతో...

– *సరోజిని*

# తుహిన కణాలు

## గుర్తింపు

**జీ**వన లతలకాధారమయిన మమతల పందిళ్ల తోరణాలకు ఆలంబనమయిన పరిచయాలు, బాంధవ్యాలు! ఏ ఒకరిని గుర్తించను? ఎన్ని కృతజ్ఞతలందించను?

ఒక చిన్న కవితా సంకలనం వెలుగు చూడాలంటే, ఎన్నో కరుణ హస్తాలు దోహదం చేయాలి మరి. మొదటిగా పేర్కొనవలసినది, అడుగడుగునా ప్రోత్సహించే రామానుజం, అక్షరం అక్షరం శ్రద్ధగా చదివి, అభిప్రాయాన్నందించే చక్రపాణి, తరువాతి ప్రయత్నాన్ని తమ స్వంత పనిగా భావించి, సహాయం చేసిన అక్క ఇందిర, విశ్వనాథ మండాది గార్లు వందనీయులు.

చిన్నప్పుడు అక్షరాలు దిద్దించిన అక్కలు అమృతవాణి, లలిత, అంతర్వాహినిగా నిశ్శబ్దమయిగా అందనిచ్చిన అరవింద, అసలు ఉనికికే కారణభూతులయిన అమ్మానాన్నగార్లు వందనీయులు.

ఈ రచన చేసినది, మా అక్క సుమా, అని గర్వపడే తమ్ముళ్లు సగరం శ్రీనివాసు, ఉదయ శంకర్లకు శుభాశీస్సులు.

అలాగే అభిమానం అందించే అత్తవారు ఇయ్యుణ్ణి వారికి కూడా ఈ గుర్తింపు. తుహినకణాలలోని ఇంద్రధనస్సు రంగులను ఆనందించి, అభినందించి, ప్రోత్సహించిన శ్రీయుతులు పర్యం కృష్ణమోహన్, శ్రీ బలిజేపల్లి శాస్త్రిగారు, శ్రీమతి మాలతీచందూర్, శ్రీమతి సరోజినీ ప్రేమచందుగార్లకు, **తుహిన కణాలు** కు మొదట ఆకృతినిచ్చిన శివప్రసాదుగార్లకు, కృతజ్ఞతలు.

చిన్ననాటి పరిచయాన్ని పురస్కరించుకొని, తానుగా ఎంతో అభిమానంతో, ఈ పుస్తకం వెలుగు చూడడానికి తోడ్పడ్డ వై. రామకృష్ణారావుగారికి, అక్షరాభివందనలు.

తెలుగు నేర్పిన సత్యవతిగారిని తలుచుకోకపోతే నా పరిచయం అసంపూర్ణం. సాహితీ క్షేత్రంలో ఆణిముత్యాల రాసులు పండించిన శ్రీ నారాయణరెడ్డిగారి సమీక్ష, నా ఈ **తుహిన కణాల** హరివింటి అందానికి మెరుపులు దిద్దినది.

ప్రత్యక్ష గురువులు కాకపోయినా, కవితాభిమానులందరికీ పదబాంధవ్యాన్ని నేర్పే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి కవితలతోబాటుగా, పదలాలిత్యపు సొంపు చూసిన డా. సి. నారాయణరెడ్డిగారికి, హృదయపూర్వక కవితాంజలి.

ఇన్ని గుర్తింపులలో, మరువరాని, మరువలేని ఆత్మపరిచయం... ఊహలు ఊసులయితే, ఊసులు బాసలుగా కవితల సేనలుగా కురిసి, కలలకదిలించి, కనురెప్పమాటున దాగిపోయిన నా నెచ్చెలికి, హృదయాంజలి.

– *ఉమ ఇయ్యుణ్ణి*

# విషయసూచిక


1. తుహిన కణాలు ................................ 1
2. పరితప్త ........................................ 2
3. అభిసారిక ...................................... 4
4. వలపు ............................................ 5
5. ఎలుగెత్తి. ....................................... 6
6. సఖుడ! .......................................... 7
7. నీ తలపుల త్రోవన ........................... 9
8. మౌనం ........................................... 10
9. కలల లోకాన .................................. 11
10. నీ తోడునీడగ ................................. 12
11. కలలు ........................................... 13
12. స్నేహం .......................................... 14
13. ఎవరు నీవు .................................... 16
14. నేస్తం! .......................................... 17
15. నేనన్నది నిజమని చెప్పు నేస్తం ........... 18
16. నీ స్మృతి ........................................ 19
17. నెచ్చెలీ .......................................... 20
18. గరికపూవు ..................................... 21
19. ఒక్కక్షణం! ..................................... 22
20. నీలాంబరం .................................... 23
21. ఎదరగిలి ........................................ 24
22. రవీంద్రనాథ్ టాగూర్ ఆధారంగా ..... 26
23. ఆత్మనివేదన ................................... 30
24. తొలివలపు. .................................... 34

25. రాగాల దీపాలు .............................. 35
26. గుబులు.......................................... 36
27. నా స్వామి ....................................... 37
28. ప్రియసఖుడ.................................... 38
29. కన్నీటి వాకిలి ................................. 39
30. నీ అడుగు ....................................... 40
31. నీ ఛాయనై.................................... 41
32. అర్పణ ........................................... 42
33. ప్రణవమై ........................................ 43
34. తలపు వాకిట ................................. 44
35. ఎద పిలుపు .................................... 45
36. తలపు మలుపున ............................ 46
37. సడిసేయకే గాలి ............................. 47
38. ప్రభూ ............................................. 48
39. నీ చెలిమి....................................... 49
40. అమ్మ .............................................. 50
41. అన్వేషణ ......................................... 51
42. పసిపాప ......................................... 52
43. ప్రతిధ్వనులు.................................... 53
44. కన్నీటి కరిగే కాలం ......................... 54
45. ఛాయనై ......................................... 56
46. మహాభినిష్క్రమణం ......................... 58
47. ఏ దారి వెదకెను? ........................... 59
48. తలపుల వెలుగులో......................... 60
49. అనుబంధం .................................... 61

50. కన్నీరు ........................................ 62

51. అలుక ........................................ 63

52. మమతలు ........................................ 64

53. నిష్క్రమణ ........................................ 65

54. ఎటుదారి? ........................................ 66

55. కాలం కదలి ........................................ 67

56. ఆవేదన ........................................ 68

57. అలలు రేగి ........................................ 69

58. ఎదసొదలు ........................................ 70

59. శ్రీరామ ........................................ 71

60. నమశ్శివాయ ........................................ 72

61. శివపాద నృత్యం ........................................ 73

62. ఓం ........................................ 74

63. ప్రథమ దృక్కు........................................ 75

64. నిటలాక్ష! ........................................ 76

65. శివోహం ........................................ 77

66. అలపు తీరగ ........................................ 80

67. విశ్వేశ ........................................ 81

68. అభిషేకం ........................................ 82

69. నడిరేయి........................................ 83

70. అడుగడుగున ........................................ 84

71. వసుదేవ సుతం........................................ 85

72. సమర్పణ ........................................ 88

73. పద్మ బాంధవుడు ........................................ 89

74. వాన ........................................ 90

75. బాస చేసి ...................................... 91
76. ఉషస్సు ........................................... 93
77. అమావాస్య రాత్రి ............................ 95
78. ఎర్ర గులాబి ................................... 96
79. పంజరపు బ్రతుకు ........................... 97
80. మమత........................................... 99
81. సమత ........................................... 100
82. విరిసేన నీ మదిని ........................... 101
83. గగనాలు ఒరిగి .............................. 102
84. ఆమని అరుదెంచె............................ 103
85. వెన్నెల పిలుపు................................. 104
86. వెన్నెల ........................................... 105
87. రాగాల దారిన ................................ 106
88. రాసలీల ......................................... 107
89. రాధిక ............................................ 108
90. నీ చెలియ ....................................... 109
91. మాధవా.......................................... 110
92. ప్రేపల్లెలో ........................................ 111
93. నిట్టూర్పు....! ................................... 113
94. నల్లనయ్యా..................................... 114
95. ఎటు దాగితివోయి .......................... 115
96. పలుకు ముత్యాలు .......................... 116
97. రాధామాధవం .............................. 117
98. వెన్నదొంగ...................................... 118
99. రాధమ్మ నవ్వేన .............................. 119

100. చిగురాకు నేకాన! ............................ 120

101. మోహనా ...................................... 121

102. నా పిల్లా. ....................................... 122

103. మావాఁ ......................................... 123

104. వచ్చిందీ వాసంతం! ......................... 125

105. రాధేయుని ఆవేదన ......................... 127

106. దోసలిపట్టి ..................................... 130

107. మనసలసి ..................................... 131

గేయకృతులు...133

108. రతీ విలాపము ................................ 134

109. రాముని ఎద రగిలినవేళ ................. 141

110. విశ్వవిభుని విరహిణి ....................... 145

# తుహిన కణాలు

నీ తలపు సవ్వడులు నా ఎద ప్రతిధ్వనింప
నినదించిన మధురగానాలు-
నర్తించే ప్రకృతికన్య పదమంజీర నిక్వణాలు
ఈ ఉషోదయపు తొలి వెలుగుల జాలువారే తుహిన కణాలు!!
గగనసీమల ఓలలాడి
తుహినగిరుల మేలమాడి
చెలుని మోవిన డోలలాడి
చెలియ కురులతో సరసమాడి
మురిసిపోయే వెలుగు కిరణాలు
మెరిసి వెలిగే తుహినకణాలు
మధుర భావ సుధలు తొణికి
జాలువారే వాగువోలె
అలముకున్నవి నీ తలపులు
నను తలపనివ్వవు వేరు సొదలు
నేనె నీవుగ, నీవె నేనుగ
అనాది జీవన బంధమెరిగి
కలసిపోయిన శ్రుతులకరగి
ప్రణవమై నిలచిపోద మీ పృథివి!
సోమనాథుడే సమ్మతింపగ
సామవేదమె సేసలై
సప్తస్వరపు బాసలై
కురిసి, తడిసే కవితలజల్లులు,
రేయి వెన్నెల వెలుగులై చినికి
గరిక చివురుల మెరిసే రంగు రంగుల తుహినకణాలు!!

## పరితప్త...

నీ చూపులు నా చూపులతో
కలసినచోట, వంతెనవేసి
నీ కన్నుల కడలిలోని
భావతరంగాల తేలియాడాలని
పైకెగసిన కెరటంతో
కలిసి, నింగినందుకోవాలని
అక్కడ అనంత లోకాల్లో
సుఖసముద్రంలో తిరిగి కలవాలని
ఆ సంద్రంలో చందమామని
తెప్పగా చేసుకొని
నీవు పడవసరంగువై
నేను నీ జాలరి కన్యనై
తీరం లేని దూరాలకి సాగిపోవాలని
ఎన్నో, ఇంకెన్నో కలల బరువున
కనులు సోలిపోతున్నాయి.
నీ మోవిపై చిరునవ్వు మెరసినవేళ
ఆ మెరుపు వెలుగులో
నా ప్రేమ కుటీరంవాకిట
రంగురంగుల రంగవల్లుల తీర్చాలనీ

నీ పలుకుల కురిసిన మధువు
జాలువారే పూలతో
నా మనోమూర్తి నభిషేకించాలనీ
నీ కన్నులలోని వెన్నెలల
నా ఆవరణ తడిసి–
పాలకడలిలా పునీతమవ్వాలనీ
కోటికోటి కోర్కెల తోరణాలు కట్టి
పసిడి ఊహల పసుపు గడపలకు పూసి
నీ రాక తెచ్చే పర్వదినం కోసం
పరితపిస్తున్నాను!!

# అభిసారిక....

తమాల తరువు చాయల తరుణి నిలచినదోయి
దవుదవ్వుల నీ పదధ్వనులు వినపడవేమి
వేకువంతా వెతకి, రేతిరంతా తలచి
తొలి సంధ్య వెలుగులో మరలి రావదేమి?
మనసు డోలిక చేసి మరులు రేపిన స్వామి
మరలి రాక నా మాట మరచిపోయితివేమి
ఊసులెన్నో తెలిపి, ఊహరేపినవేళ
బాస చేసిన నన్నిటు ఎడబాసితివదేమి?
వెదకి వెదకి నా కన్నులలసి పోయినవోయి
తలచి తలచి నా తలపు విసిగి వేసరినదోయి
ఇక నీవు రాకున్న నా వలపు మోడగునోయి
ఇకనైన కనుపించి, కలత తీర్చగదోయి.

# వలపు...

వలపు చినుకు చినికి, కలికి మనసు తడిసి
కొసలు మొదలు కనని వలపు తలపు విరిసె
ఉసురుసురని వగచి, విసిగి, చెలుల విడిచి
మసక మసక వెలుగు మలుపు వెనుక నిలిచె,
వెదకి వెదకి కలికి కనులు అలసి అలసి
తలచి తలచి తరుణి తలపు విసిగి విసిగి
పిలచి పిలచి చెలియ గళము సొలసి సొలసి
తరచి తరచి అతివ సఖుని అరసి, మురిసె,
గడియ గడియ గడప తలుపు గడియ తెరచి
మరులు తెలిపి తనదు విభుని పదముకలిసె
సఖుని కనుల మెరసె చిలిపి నగవు మెరుపు
సఖియ పెదవి విరిసె మిసిమి కుసుమం విరుపు!

# ఎలుగెత్తి....

ఎలుగెత్తి నీ కొరకు ఎపుడు పిలిచెదమన్న
గళము మూగవోవును, తెలియని సంకోచాన
పలుకలేని భావాల నీ కెరిగించుటెట్లు?
తెలుపలేని తలపుల నాలో దాచుటెట్లు?
తలపుల మలుపులో దాగి, మరుగైననెచ్చెలీ,
మనసు తలుపులు తెరచి లోనికి రావదేమి?
నీదైన ప్రాంగణాన నీ వతిథివలె నిలిచి
మనసు కావలెనె అగి, నాకై చూచెదవేమి?
నీ రాకకై రేయింబవళ్లు వేచి,
బరువైన రెప్పల బ్రతిమాలి తెరిచి,
ఏర్చి కూర్చి పూరేకుల రాశిచేర్చి,
సంధ్య తల్లిని వేడి, కుంకుమల కూర్చి,
నా హృదయ పీఠాన నిను నిలుపువేళ,
లోగిలిలోని విరజాజి మాటున
ఇంకొక్క పూవుకై నేను అగినవేళ
తలుపు తెరచి, ననుకానక, అలిగిపోయితివేమి!
అలిగి వెడలిపోయిన నీ గుర్తుకానక
ఎంత వెతకి ఎన్నాళ్లు ఎదురు చూడను నేను!
నీ కొరకు ఏరిన ఆ ఇంకొక్క పూవు
వసివాడక మున్నె వెనుదిరిగి రావోయి!
బ్రతుకంత నీ కొరకు ఎదురు చూచిన నన్ను
నా చిన్ని పూవును కలిపి నీ యెద చేర్చవోయి

# సఖుడ!

రేకు విరిసిన మొగ్గ మదిన ఏల ఈ పులకింత
మోవి విడిని హాసాన ఎందుకీ గిలిగింత
అరమోడ్చిన కనుదోయిన ఏదో తెలియని ప్రశాంతి
ఈ సాయం సంధ్యా కన్య చెక్కిట ఎందుకీ
అరుణిమలకాంతి?
జీవితంపు బాట ప్రక్కన తోడు నడచిన సఖుడ
గమ్యమెక్కడని నన్నిక ప్రశ్నించకోయి
తోడుగా వచ్చిన నెచ్చెలికి నీడైన నేను
ఆ నీడనే నా గమ్యమని నిలచి నమ్మితినోయి
నేనేగు దారిలో మల్లెమొగ్గలు పరచి
విరిసిన సుమసౌరభాల నా బ్రతుకు నింపి
దారి ప్రక్కన దాగి, దారి చూపిన సఖుడ
నా దారిలో నీవు బాటసారివె కాబోలు!
కనురెప్ప తాకిడికి కదలిపోయె కలలు
కలల లోకాన కదలాడె మమతలు
భాషకందని బంధాల పెనవేయు తలపులు
కలిపి నిలిపిన స్నేహంపు రాశి నీవు!

నీవు నడిచిన బాట గరిక ముత్యాలు తొణికి
వొలక బోసిన చల్లదనాల నా యెద మరిగె
లేలేత వెలుగులో రేకు విరిసిన రెల్లుపూలు
ఊగూగి నీ రాక నా తలపుకెరిగించె,
మనసు అంచులకావలెనె నిలచి
పలుకరించి, అలవోకగా, కదలిపోయిన సఖుడ
నీ చెలిమి నాలో కలసి కరిగిపోయి
ఇక నీవు నేనన్న భేదమె సమసిపోయె

# నీ తలపుల త్రోవన...

గుండెలోన తెలియని ఊసుల
గుసగుసలు వినిపిస్తున్నవేళ
మండుటెండలో మలయ సమీరంలా
నీ తలపులు నన్నలముకొన్నవేళ
నేనొంటినైతినన్న
ఊహయే మరిచిపోయితిని,
కల్లోల సంద్రంలాంటి ప్రపంచమిది
ఇంత కోలాహలంలో,
దిక్కుతోచని వేళ నేను
నీ ఊసుల ఊహల ఊయలలో
ఊగిసలాడుటేకాని
కనువిప్పి ఈ అలజడి కాంచనైతిని నేను
నీ భావనలందించిన నూత్నానందముతో
దారి తెలియదన్న భావమే లేదునాకు!
నిన్ను చేరబోవు జిలిబిలి తలపులతో
నన్ను చుట్టుముట్టు ఆటంకాల గమనించనేలేదు,
చేరనున్నది శీతాంశుని ఆవరణయన్న ఆశతో
నేను పయనిస్తున్న మండుటెడారి గుర్తింపనేలేదు,
నిన్ను గూర్చిన ఒక్క తీయని తలపు చాలు
కోటికోటి ఎడారులుదాసి,
అనంతకోటి సముద్రాల తరసి
నీ దరి చేరగల్గుతానన్న
ఊహయే చాలు నాకు!!

# మౌనం...

గుండె లోతులు కదిలి
కంటి చెలియలికట్ట దాటిన
వరదలై పొంగు వ్యథలసొదలు
వెడలి బయలు పడనీయవేమి?
పెదవుల కదలిక అస్పష్టమై
శబ్దరూపాలు వెడలనివేళ
ఎడద బరువై ఎందులకీ వ్యథ?
వికసించని మొగ్గవలె
వర్షించని మబ్బువలె
హర్షించని మమతవలె
ఎందులకీ మౌనం??
నీ మౌనపు నిట్టూర్పు
గ్రీష్మతాపమై నా మనసు రగిలి
చెమర్చిన కనుల తడియారినవేళ
నెచ్చెలీ, నిన్నే పలుకుల ఓదార్చను?
ఆమని వెడలినా, ఆకులు వదలినా
ఎడద బరువై, శిశిరమే మిగిలిన
ఆశ చెదర నీకు, మనసు బెదరనీకు
నీకు తోడైన నా చేయి వదలనీకు
కలతదీర్చి నీ కన్నీరు తుడువలేను.
హొడి చేర్చి నిన్నిట ఓదార్చలేను
మమత పంచి, కొంత నీ బరువుతీర్చి
మనసు తేలికచేయ, నే మనసారకోరేను.

# కలల లోకాన....

నిదుర భారాన బరువైన కనురెప్పలలసి
కలల లోకాల కలసే తరుణ మరసి
మొయిలు దారుల దోగాడు మెరుపువలె మెరసి
నిదుర కన్నియ చెరగున మోముదాచి
సుప్త జగతిని కరగె సఖియ తలపు
తలపు మరుగున దాగు వలపు పిలుపు
పిలుపు మలుపున పలికె సఖుని చెలిమి
బ్రతుకు బ్రతుకంత వెన్నంటునదె కలిమి
తలిరాకు పొత్తిళ్ల మెత్తదనాలు
నెలవంక మత్తిల్లు కొత్తదనాలు
నిన్న నేడుల అనుభూతి అనుభవం వెచ్చదనాలు
కలిపి, కలబోసి స్నేహాలరాశి చేసి,
మనసు మరపింపజేయు మధురమూర్తి
ఓపలేదోయి, ఈ చిన్ని బ్రతుకు
నీ తలపు రగిలించు వలపు బరువు
నీ చేయి నందించి, నా చేయినంది
ఎటకేగెదమోయి, తెల్లవారని ఈ రేయి??

# నీ తోడునీడగ....

సడిలేని నడిరేయి నీ చేయినేనంది
నడిచేను వడివడిగ నీ తోడు నీడగ
బడలేన నీ ఎడద నీవెతల తాకిడికి?
విడలేను ప్రియసఖుడ, ఇక నేను నీ నీడ
కరిగిపోయిన కాలము, వెలలేని స్నేహము
మరలి రావోయి చెలుడ, మరి ఏల తాపము?
నిన్న గడిచెనని వగచిన, మన చెలిమి పుటలలో
'నేడు' కలిసిపోయి, 'రేపు మాసిపోవునేమో!'
నిన్న నీ నవ్వు నా మనసు పులకింప
నేడు నీ దవ్వున నా చెలిమి చిగురింప
రేపు నీ రూపు నా మమత వెలిగింప
నేనె దివ్వెగ నీ వాకిట నిలిచేన!
వెలిగిన నా మమత నీ బ్రతుకు నింపి
నీ కంటి పాపనంటిన తళుకుగ మెరిసి
నీ మోవి యంచున దాగి, చిరునగవుగ మారి
మరల నా హృది చేరి, నన్నలరించునోయి!
అదియె నా మమతకు అర్థమంటిని సఖుడ
ఇదియె మన బ్రతుకు పండించు, సరియైన బాట
మనల బంధించే నేడు మృదువైన ఈ మాట
ఇక నా చేయి విడువకోయి మనలేను –
మనసు నిండిన చెలుడ!!

# కలలు...

కనుల కలలు కదలి అలలై
కదలి అంచును కలిసి నురగలై
మింట మెరిసే తళుకు మెరుపులై
నీ కంట వెలిగెను చిలిపితలపులై
చెలియ తలపున వలపు పలుకై
మబ్బు తాకి, ఆ మెరుపు తాకి
పుడమి తడిపె సుధల చిలికి
కురిసి కురిసి వానజల్లు
మనసు తడిసి, మమత తడిసి
రంగురంగుల కలలనల్లి
వెల్లివిరిసెనదె హరివిల్లు!
తెల్లవారే తూర్పు నేనై
కల్ల కాదని నీ కనురెప్ప తాకిన
మెల్లమెల్లన నీ కనులు విప్ప
ఝల్లుమన ఎద కదలిపోతి!!

# స్నేహం....

నీ పదాల కూర్పులోని ప్రౌఢిమ కచ్చేరువొంది
నీ మాటల దాగిన ముగ్ధత్వానికి నిశ్చేష్టనైతి
అందు పొదిగిన మమతలకు మనసు స్పందించి
భావాల బరువు మోయలేక,
నా ఈ చిన్ని బ్రతుకు విన్నబోయింది.
ఓపలేదీ చిన్ని మనసు
నీవందించిన మానస తరంగాల తాకిడిని
పలుకలేదీ మూగవీణియ
తేనెల ఆర్ద్రత బరువుతో
కపటమెరుగని మది ప్రతిఫలిస్తుంటే
కరుణ కురిసే కన్నుల వెన్నెలలకాంచి
ఆ కనుల జాలువారే స్నేహసుధల కరిగి
ఆ స్నేహసుధలోని స్నిగ్ధ దరహాసమెరిగి
ఆ దరహాస చంద్రికల చల్లదనాల మరిగి
ఆ చల్లదనంలోని చైతన్య లహరిలో కలసి
చివరికి అచేతనమయిపోయింది.
కనుల నిండిన నీరు కదలిజారకముందు
అనుభవపుటనలంలో ఆవిరైపోకముందు

మాటలల్లి, ఆవల వెనుక నా మనసు దాచివేయకముందు
నవ్వు పువ్వుల నీడల్లో, నా అశ్రువులను కలిపివేయకముందు
నన్ను 'నేను'గా గుర్తించిన నా నేస్తం
ఎన్ని అక్షర నక్షత్రాల రంగవల్లులు తీర్చి
ఈ స్నేహాకాశపు తలవాకిలి నలంకరించను?
ఈ భవబంధాల ఛేదించి, ఏ భావబంధాల నిలచిపోను?
ఈ రాగద్వేషాల నతిక్రమించి
స్నేహరాగాన ఏలాగు కరగిపోను-
ఈ కల్లోల మానస తరంగిణిలో
ఎన్ని అలల తేలితే
స్నేహం ఆవలి తీరం చేరగలను??

# ఎవరు నీవు...

నిశ్శబ్దం నినదించే వేళలో
వెలుగు నీడల మిశ్రమం నునులేత ఛాయలో
నెచ్చెలీ, స్మృతుల సవ్వడి సన్ననై
అంతలో ఎలుగెత్తి విశ్వమంతా నింపువేళ
మన అనుబంధం లలితమై
లిప్తకాలపు సాన్నిహిత్యంలో
శాశ్వతమగువేళ
ఎవరు నీవన్న ప్రశ్న ఏల?
మమతల మరువపు రేకుల పరిమళాలు
మనసంతా నింపి, మనలను పొదివికొన్నవేళ
పెదవుల కదలికలో పొదగలేని పదాలకు
రూపమివ్వాలన్న ప్రయత్నమేల??

## నేస్తం!....

చెప్పు నేస్తం, నేనన్నది నిజమని,
నిండు జగతిన నాకండ నీవె
చెప్పు నేస్తం, ఇది నిజమని
కల్ల నిండిన బ్రతుకున
కరగని కల నువ్వొకడవె
చెప్పు నేస్తం, నాది కల్పన కాదని!
ఈ విశాల జగతిలో
ఏకాకి నేను, నువ్వే నాకు ఒక్క తోడు
చెప్పు నేస్తం, నాది భ్రమ కాదని
అసుర సంధ్యలాంటి బ్రతుకులో
ఆశాకిరణం నువ్వొక్కడివె
చెప్పు నేస్తం, నాది పేరాసకాదని!
నా 'కొమ్మ' బ్రతుకున పూచే
పువ్వుకి కాడ నువ్వు నేస్తం,
చెప్పు నేస్తం, మన అనుబంధం నిజమని!
మనం స్నేహం తోటలో
రెండు చిన్న పూవులం
నవ్వుతూ, నవ్విస్తూ రాలిపోదాం
అని మరొక్కసారి చెప్పు నేస్తం
నా పలుకు నిజమని!

## నేనన్నది నిజమని చెప్పు నేస్తం...

మనసు మనిషికి మహనీయమైన వరం
మమత పలికిస్తుందొక మధుర స్వరం
ఆ రాగలహరిలో పునీతమవుతుంది జీవితం
స్నేహ సౌహార్ద్రంలో మొలకెత్తునొక
మృదుతర మందహాసం
మనికిలోని మార్దవానికది మాయని చిహ్నం
'మాటలు వేయేల' అని మందలిస్తుంది అంతరంగం
మంచి మనసున మరి ఉన్నదే మార్దవం!
మనిషి కోరేది మడి మాన్యాలు కావు
మనసు నింపేది మహారాజ భోగాలు కావు
మరేది మనుగడ సాఫల్యం?
మమత, మానవత నిండిన జీవితం
నేనన్నది నిజం కాదు - ఆలోచించు నేస్తం!!

# నీ స్మృతి....

గూటిలోని గువ్వలజంట కువకువలో
నీటిలోని నీలికలువల కాంతులలో
పసిపాప కిలకిల నవ్వులలో
సాగు సెలయేటి గలగలలలో
నెచ్చెలి, నీ తలపులే నను పలుకరిస్తున్నాయి.
చిరుగాలికి చెదరిన చిగురాకుల ఊసులలో
తేటి చెలికాని రాకకు పులకించిన పూవులలో
మంచు తడిసిన పచ్చని పచ్చిక చివుళ్లలో
నెచ్చెలీ, నీ గుసగుసల బాసలే వినిపిస్తున్నాయి.
ఇరు సంధ్యల పసిడి నీరెండలో
అరవిచ్చిన సన్నజాజుల సౌరభంలో
నెచ్చెలీ నను నీ మనసు పలుకరిస్తోంది
నీ ఊహకు నా మది పులకరిస్తోంది
ఎన్ని జన్మల స్నేహమిది?
రెండు మనసుల అనురాగమిది–
ఎన్ని బ్రతుకుల అనుబంధమిది?
బ్రతుకులోన వీడని – విడనాడని
పవిత్ర బంధమిది!!

# నెచ్చెలీ....

ఈ సుప్త జగతిలో
ఈ సుందర సమయంలో
నీ స్మృతులు నన్ను స్పృశిస్తూ
అరమూసిన నా కనురెప్పల
నలవోకగా పలుకరిస్తున్నవేళ-
మనసున నేను మెదిలి
చెమ్మగిల్లిన నీ కనురెప్పలు
రెపరెపలాడి, పన్నీరు
చిలికించినట్లు, నెచ్చెలీ
అంతేలేని అగాధాల కలుపుతూ
ఆకాశం ఆవలి అంచున నీవు
అవనిలో ఈ చివర నేను
కలిసి తడిసేటట్లు వానజల్లు
నిండు ఆకాశపు దూరం మనమధ్యన ఉన్నా
నిన్ను నన్ను కలిపి నవ్వుతోంది హరివిల్లు.

# గరికపూవు...

నీ వేగు దారిలో గరిక పూవును స్వామి
నీ పద ధ్వనులకై వేచి నిలిచితినోయి
మంచు తడిచిన ఈ మధుర ప్రభాతాన
సడిలేని అడుగుల నడిచిపోయితివదేమి?
నీ రాకకోసమై రేయంత వేచి
నా తోటి పూల కల్లంత దూరాన ఆగి
నీ కోసమేయని, నా మనికి నిలిపి
పూజవేళకు నీకు నన్నర్పించగోరి
చేరబోయినవేళ, చిన్నబుచ్చెదవేమి?
మరలిరావోయి నా మనసు దోచిన స్వామి
మల్లెనైనాకాను, నిన్నలరింపనేను
మందారమేకాను, నీ మందిరము చేర
సంపెంగనీ కాను, సొగసు లీనంగ
గరిక పూవును స్వామి, నీ పొందు కోరితిని

# ఒక్క క్షణం!...

కాలవాహినిలో కరగిపోయిన క్షణాలు
మమతల మధూదయంలో మెరసిన తుహినకణాలు
అవధులెరుగని అనురాగపు వెల్లువలో
ఆకసపుటంచులు తాకే భావోద్విగ్నతరంగాలు
ఆమని వచ్చినవేళ, ఆలయ ప్రాంగణం చిగిర్చి
నా స్వామి అడుగుల పచ్చని పచ్చికలుపరచి
మనోద్వారాన మమతల తోరణాలు కట్టి
పులకించిన మది నివాళిగా వెలిగించి
అర్పించిన ఆ క్షణాలు కరగిపోయినది నిజం
పునీతమైన ప్రతి క్షణం, ఒక పరిపూర్ణ భ్రమణమై
విశ్వమంతా తిరిగి, హృదయాంతరము చేర
ఆ బిందువు కన్నీటి ధారయై కనుపాప నధిగమించి
చెక్కిలి చేరిన ముత్యాల సరాలు కూర్చి
మరల నీ యెద చేరి, నిన్నలంకరించ
జరిగిపోయిన క్షణమేది?
కరగిపోయిన నిజమేది??

## నీలాంబరం...

అవధుల్లేని నీలాంబరం అందాలు
అవని అంచుల పచ్చని గరిక చివుళ్ళతాకి
మెత్తని పూపొత్తిళ్ల దాగిన మధుబిందువులై
తూరుపు వేదిక నలరించిన తారకమైనవేళ
అచ్చెరువొందిన గిరుల శిఖరాలు
నిశ్చల దృక్కుల నిలచిపోయాయి.
చైతన్యపు మలయమారుతాలురేగి
ప్రకృతిని పలుకరించి పరవశింపజేయ,
ఆ స్పందనలోని అందాలు నింగినంటి
మళ్లీ నీలాంబరంలో ఒదిగిపోయాయి...

# ఎదరగిలి...

కంటి చెలియలికట్ట కదలి దాటనీయకపోతె
కదలి గర్భాన కల్లోలమా మరి!
మాట కెరటాల మరుగున మాటుసేయగలేని
మనసు మూగ వీణియ తంత్రుల పల్లవెటుదాచేను?
పల్లవించే పలుకు గళము రాసుకుపోయె
రాగాన ఏ పదాలాలపించేను?
బ్రతుకు తోటలోని పసిమొగ్గ యిది
రేకులే విప్ప నీవు ఆలసించేవేమి
ఆమని వచ్చేనని, ఆనందపడబోవ
వడగాడ్పువీచి, నా యెడద దహించెదవేమి?
ప్రభూ...
నీ తోటలోని కోటి పుష్పాలలో
చిన్ని గరిక పూవిది, కాలరాయకు మోయి
కమ్మ తావుల నిచ్చు చిన్ని పూవిదిస్వామి
చేర్చి నీ యెదను ఆదరింపవదేమి?
కొమ్మ కొమ్మను లేత రెమ్మలతో నింపి
రేకు రేకున నీ కుంచె రంగులను తీర్చి
చిత్ర విచిత్రమ్ముల చైత్రమాసమ్మునిచ్చి
విచ్చు సమయాన ఈ విన్యాసమేమి?

ఇక చాలు ప్రభూ, నీ నింత లాస్యాలు
విశ్వమంతా నింపు, నీ కరుణ హాసాలు
నీవైన పూలేమో తోటంతనింపి
నా చిన్ని పూవునిట చిన్నబుచ్చి
పరిహాసమాడేవు నా ఆశతోడ
ఇక చాలు ప్రభూ ఈ పరుష కథనాలు
కథనాల కాఠిన్య గ్రీష్మతాపాలు
వాడిపోనీయకీ చిన్ని కుసుమాన్ని
మా తోట నాటిన నీ కరుణ భావాన్ని
రేకు రేకుల విచ్చి రేబవలు శ్రమించి
విశ్వమంతా నింపి, నా యెదను తాకి
కనుల వెలుగులు నింపి, కన్నీరు తుడిచి
బ్రతుకు దారిన సాగి, బ్రతుకంత నిండి
చిరునవ్వు చిలకించు కారుణ్యమూర్తీ
చేయూతనందించు చైతన్యస్ఫూర్తీ!!

## రవీంద్రనాథ్ టాగూర్

### 'Crossing' ఆధారంగా (స్వేచ్ఛానువాదం)

ఒక్క క్షణం ప్రభూ, ఒక్క క్షణం అనుగ్రహించు నన్ను
నీ తోడులేక, ఆక్రోశించిన విషాద గతాన్ని విస్మరించనీ
ఈ ఒక్క క్షణాన్ని నీ కాంతితో నింపి, నా బ్రతుకు పునీతం చేయి
ఇన్నాళ్ళు, నన్ను పలు మార్గాల పయనింపజేసిన
ఆకర్షణలతో విసిగిపోయాను
ఇన్నేళ్లూ గమ్యమెరుగక విలపించి, వేసారిపోయాను
ఇప్పుడు, ప్రశాంతి నిండిన నీ సన్నిధిలో
నా పరితప్త హృదయాన్ని విన్నవించనీ
అజ్ఞానాంధకారాన అనగిన నన్ను అసహ్యించుకుంటావా?
ఉహుం, లేదు, నీ కరుణార్ద్ర నయనాలతో
నాలో జ్యోతులు వెలిగిస్తావు కదూ
నవరసభరితమైన ఈ జీవన సుమాన్ని, నాకు ప్రసాదించావు
అయితే, దాని తావిని ఆస్వాదించు తరుణాన
నేను సుషుప్తిలో ఉన్నాను
అయినా, ఏదో అస్పష్టమైన, అనిర్వచనీయమైన
సుందరమైన అనుభూతికి లోనయినానొక్క క్షణం
ఆ క్షణపు అలౌకిక తృప్తి, నా జీవన కుసుమాన్ని వికసింపజేసి
నన్ను జాగృతుడిని చేసి, నీ మ్రోలవాలమని
ఈ శుభోదయాన, నాలో ఉత్సుకత రేపుతున్నది ప్రభూ!!
మేఘాచ్ఛాదితమై గంభీరంగా ఉందీనాడు ప్రకృతి

నీలిమబ్బులయంచునుండి, ఓరగా చూస్తున్నాయి మెరుపులు
ఉండుండి, బంధితుడైన మృగరాజులా గర్జిస్తోందాకాశం
బీభత్సంగా, విజృంభించి, ఆందోళన చేస్తున్నాడు ప్రభంజనుడు
ఏమిటి ప్రభూ, ఈ అల్లకల్లోలం?
ప్రశాంత స్వరూపుడు, సౌమ్యమూర్తి, సృష్టికర్తకా క్రోధావేశం?
అత్యల్పులయిన మానవశ్రేణి మీదనా నీ ఆగ్రహం?
లేదు-లేదు అనంతమయిన జీవనవాహినిలో ఈదులాడె మానవాళి!
ప్రశాంతి విలువ తెలియాలని, అజ్ఞానాంధులకు నీ సాన్నిధ్య సౌందర్యం
తెలియాలని, ఈ బీభత్సం!
అంతూ, దరీ లేని ఈ జీవితంలో సృష్టికర్త కోసం మాకొక్కక్షణమేది
నీ సామీప్యాన్ననుభవించాను ప్రభూ, ఒక్క తృటికాలం
నిర్మలాకాశం, సాయంసంధ్యారాగ రంజితమైనవేళ
సరిగంచులు సర్దుకుంటూ, నిశాదేవి మెలమెల్లన అరుదెంచినవేళ
కాలిమువ్వల సవ్వడి కాకుండ, వేకువకాంత అల్లన వీడ్కొనువేళ
ఉభయ సంధ్యల వినూత్న కాంతిలో
ఇరుతీరాలను చుంబిస్తూ, ఉత్తుంగతరంగాలెగసినవేళ
సాగర గర్భం నుండి, విశాల నీలాకాశం నుండి
ఎక్కడో, కోటి వీనలొక్కసారి పల్లవించినటులు
కోటి కోయిలలు కంఠమెత్తినట్లు ఏదో భావన!
భాషకందని భావం తటిల్లతలా మెరిసింది
నా భగవానుని కనులారకాంచు ఆతృతలో
నా కనుల నీరు నిండుట గమనించలేదు

ఆ ముగ్ధ మోహన రూపాన్ని చూచు ఆకాంక్షలో
నాలో రేగిన ఉద్వేగాన్నణచలేకపోయాను.
ఫలితం–
జీవితమంతా తపసు చేసిన క్షణం జారిపోయింది
కనులనిండిన నీటి మసకన నీ రూపం స్పష్టాస్పష్టమైనది
నీ దివ్యమంగళ రూపాన్ని కనులముందు చూస్తూనే
కనులార కాంచలేకపోయాను.
ఇన్నేళ్ళు, విస్ఫారిత నయనాల ఎదురు చూసిన గడియ
సమీపించగానే, నా దృష్టిని బాష్పమేఘాచ్ఛాదితం
చేశావు – ఇదెక్కడి న్యాయం ప్రభూ?
నీ దర్శన భాగ్యానికి మరొక్క జన్మకాలం నే వేచియుండలేను
ఈ క్షణాన్ని శాశ్వతం చేసి, నాకు సాయుజ్యం ప్రసాదించు.
ఎన్నో దినాలుగా, నా యింటిని ఏ అతిథి పావనం చేయలేదు
నా ద్వారాలు బంధింపబడి, నా గవాక్షాలు మూతపడినాయి.
ఇక ఈ రాత్రి కూడ నిశ్శబ్దమే తోడుగా గడిపేననుకున్నాను
కాని, నా కన్నులు తెరచినప్పుడు, నన్ను నేనే నమ్మలేదు.
నా ద్వారాలన్నీ తెరచియున్నాయి,
గవాక్షాల నుండి గాలులలనల్లన వీస్తున్నాయి
ఒక్కసారి ఉలికిపడ్డాను.
నీ కాంతి కిరణాలు నన్నలవోకగా స్పృశించాయి.
ఇది ఎక్కడి వింత?
నా గృహంలో నేను బంధితుడనయినప్పుడు

స్వేచ్ఛగా ఎగిరిపోదామని, ఎటో
విహరిద్దామని
కలలు కన్నాను – కాని ఈనాడు,
తెరచి ఉన్న నా గృహ ప్రాంగణాన
నీ రాకకై నిరీక్షిస్తున్నాను
ఈ నిరీక్షణకు సాఫల్యమున్నదా? ఏమో
అయినా, నేనీ ప్రాంగణం విడువలేను
నీ పదధ్వనుల కోసం వేచియుంటాను
నీ పిలుపు కోసం ఎదురు చూస్తాను
ప్రభూ, ఈనాటి నా స్వేచ్ఛతోనే
నేను బంధితుడనయినాను.
(గురుదేవులకి కృతజ్ఞతతో)

# ఆత్మనివేదన

(గతంలో 'కవిత పేరు మానవత'లో ప్రచురితమైనది)

ప్రభూ,

కోటి వీణారవాల మేళవింపునీవు
శతకోటి జీవన గీతుల ముక్తాయింపు నీవు
ఈ బ్రతుకు బాటకు గమ్యమ్మునీవు
నా జీవన కాసారమ్మున ఉషారాగమ్మునీవు
నవ వసంతమ్మున కోకిలారావమ్ము నీవు
వికసిత కుసుమములోని మధురిమ నీవు
నా జీవన రాగానికి ఆలాపన నీవు
నా ఈ భావాలకి పట్టుకొమ్మ నీవు
నీ పదధ్వనికి ప్రతిధ్వనిని నేను
నా బింబమునకు ప్రతిబింబమీవు
నీ సృష్టిలో నికృష్ట జీవిని నేను
నా ఊహకే పరాకాష్ఠ నీవు!
నీ పలుకులో మధురిమ లొలుకువేళ
నా హృదిలో మ్రోగేను వలపుల వీణ
నీ పదమంజీరాల నిక్వణము వినిపించువేళ
బేలనై వ్రాలిపోతి నీ మ్రోల
ఏలకో ఈ మదిలో అంతులేని నిరీక్షణ
నన్నేలు ఏలికవు రావొ, సాగింపలేని అన్వేషణ

విన మనసాయె మరల నీ మృదుభాషణ
కలుగదొ ఇకనైన నీకు, ఈ దీనపై కరుణ!
కనుల నిండిన ముత్తెములు జాలువారకమున్నె
నిరాశలో నా బ్రతుకు తెలవారకమున్నె
వేదనతో నాగళము మూగవోపకమున్నె
కరుగ నిమ్ము నీ పదముల పసిడి ఛాయలోన
ఈ ఎదదలో సుడులు తిరిగెడి బాధకు
భాష్యమేది, సరియైన భావమేది?
శ్రుతి తప్పిన ఈ జీవన గీతికి సరియైన రాగమేది
నా వ్యథ నీకు వినిపింప సరళ మార్గమేది?
లేదోయి, లేదోయి నా బ్రతుకునకిన ప్రభాతం
ఎటుచూచిన అంతు తెలియని గాడాంధకారం
నీ తలపొక్కటే మిగిలిన ఆశాకిరణం
ఇక నా కోరికొక్కటే, ఈ జీవనరంగం నుండి నిష్క్రమణం
ఈ విశ్వమును నింపు వెలుగు నీవు
కాంతినెరుగని కటిక చీకటిని నేను
సుధామధురిమల వెదజల్లు రేరాజువీవు
నీ రోచిస్సు కబళించు నీలిమబ్బును నేను
కార్చిచ్చు రగిలించు గ్రీష్మతాపము నేను
మది సేదదీర్చు మలయమారుతము నీవు
అనుభవాల రోసి, రాలు ఎండుటాకును నేను
ఆశల ప్రభాతములోని తలిరాకు నీవు

బ్రతుకు భారమోపగలేని బేలనేను
సప్తసంద్రాల గాంభీర్య మూర్తి నీవు
కన్నీటి కెరటాల కడలి నేను
సుఖసంతోషాల కూడలినీవు.
ఇన్నేళ్లుగ వహించిన బింకమా సడలిపోయె
కడగండ ఎడారిలో బ్రతుకేమొ వడలిపోయె
ఇక నిన్ను చేర గలుదునన్న ఆశ కూడ మాసిపోయె
నీవె నాకడకు దిగిరావలయు సమయమాయె
వలపించి విలపింపజేతునిది యేమి వింత
కనుల కలలు నింపి కలిగింతువు కలత
కనిపించి, మది వెదకిన కనుపింపవు నాచెంత
నీ దాగుడుమూతలలోనె గడిచె నా బ్రతుకంత!
పిలిచి పిలిచి నాగళము రాసుకొనిపోయె
వెదకి వెదకి నా కనుదోయి అలసిపోయె
భంగపాటున నా మనోద్వారములు మూసుకొనిపోయె
భరింపలేక ఈ వ్యధను నా ఆత్మ నీకై ఎగసిపోయె
బ్రతికినన్నాళ్ళు నా కడకు రాలేదు నీవు
బ్రతుకులో నిను చేరు శక్తి లేదు నాకు
కాన ముగిసెదు నా బ్రతుకు నిను చేరు మూర్ధమున
ఇక నేను కరగి కలిసిపోయితి నీలో
బాధలు లేవచట, వ్యథలకసలే చోటులేదు

ఆశ నిరాశలను ప్రసక్తికి తావులేదు
బ్రతుకు లేదు అందు భంగపాటు లేదు
ఇక నీవు నేనను భేదము కానరాదు
చర్మ చక్షువుల కనుపించ నెంచలేదు కాబోలు
కాని, మనో నేత్రములనుండెటు ధాగగలవోయి
ఈ దేహమును వీడి ఆత్మ నీ కందించితిగదోయి
ఆత్మ నీదైన ఈ దేహము కూడ నీదె, గైకనవోయి
పునీతమైపోతి, నాకు సాయుజ్యమదేనోయి.

## తొలివలపు...

హరివిల్లు దారిలో
విరజాజి తావిలో
ఎలతేటి పాటలో
చిగురాకు తోటలో
నిలచి పిలచిన సఖుడ
వలచి పలకినది చెలియ
కేలుకేలున తాకి
మేలమాడిన చిలిపి చేతలు
గిలిగింతలిడ తనకు
పులకింత కాదు తనువు
నునుసిగ్గు ఉదయించి
కనుదోయి అరమెడ్చి
కలువ కన్నియవోలె
వికసించ మనసాయె!

# రాగాల దీపాలు...

నా ఎద నీవు నడచిన అడుగు సవ్వడులేవి?
నా మది నీవు నింపిన నగవు పువ్వులవేవి?
నా హృది నీవునినదించు చిరుమువ్వలేవి?
నా మది నీవు వెలిగించు వలపు దివ్వెలేవి?
రాగాల దీపాలు వెలిగించి ఈవేళ
దోగాడు రూపాల వెతికేను నేనేల?
లోకాల చీకట్ల తరిమేను కాంతులు
భావాలు తామంత నిలిపేను శాంతులు
చిలిపి చీకటిన దాగు, వెలుగు బాలుడ వీవు
వలపు మాటున వెలుగు, తలపు బాలను నేను
కలసి దోబూచులాడ, మురిసేను ఈ జగము
అరసినాస్వామి, నీలోన కాననే సగము??



# గుబులు...

నాదు గళమునందు రగులు
వెలికి రాని గుండె గుబులు
పలుకులోన పొదగలేని
తలపులోన ఒదగలేని
వెతలు తాము చెలరేగి
కలత చెందెను మనసిదేమి?
కనులు విప్పిన కలలు చెదరె
కనులు మూసిన నిదురచెరగె
కనుపాపల కదలికలో
గతమేదొ కదలిసాగె
'నిన్న' పిలచి 'నేడు' పలికి
'రేపు'కొరకై ఎదురు చూచి
అలసిపోతివ ప్రియసఖుడ
అలుపు తీరగ రావ, చెలికడ!!

## నా స్వామి....

ఏనాడు నా మదిలో నిను మరువలేదు
మూసిన మమత తలుపులు తెరువలేదు
దాచిన కలతల, నీ దరిచేరనియగలేదు
వేచిన కనుల వాకిలి మూయనేలేదు
కనుల కరగెడు ముత్యాల దోసిళ్ల నింపి
నీదు వాకిట రమ్యమగు రంగవల్లులు తీర్చి,
వెలుగు కిరణాల ముంగిలి మెరిసినవేళ
చిన్ని సుమముగ, ఆకు మాటునే వొదిగిపోన!
నీ చూపు నను తాక పులకించిపోన
ఆకుముసుగుల తోసి, నే విరిసిపోన
నీ పూజ సమయాన, నేనే ముందుగ నిలచి
నా స్వామి నీ పొందు, నీ కరగిపోన!!

## ప్రియసఖుడ...

పలుకు పలుకునకొక తేనె చినుకులది
తలపు తలపునకొక తలిరాకు పొదిగి
పదము పదమునకొక తొలి దివ్వెగ వెలిగి
నీ పథము వెలిగింతు నీ కొరకు సఖుడ
వెలుగు బాటల నీవు సాగిపోయెడువేళ
జిలుగు వెన్నెల నీకూ దారిచూపెడువేళ
ముసురు చీకట్ల కసిరి తొలగించి తోసి
వేసెదను ముగులుగ రతనాల రాశి
కనులకాంతులు నికు కానుకలు కాద
చిరుత నగవులే నీకు చిరుదివ్వెలే కావా
నెలత నేమ్మోము నీకు నీరాజనము కాద
కలత తీరగ నీవు సేద తీరగ రాద

# కన్నీటి వాకిలి

నీలాలు పొదిగిన నింగి మబ్బు కరుగ
కదలి జారేన కన్నీటి వాహిని
కనురెప్ప కదలింప కురిసేన ఎదరగిలి
చినుకు చినుకుగ మొదలిడి, కలిసేన కదలి!

నీదు వ్యథ నింగియంతయు నిండి
నాలుగు దిశల నింపి ననుకలవరపరచి
తుది మొదలు తెలియని తపన కలిగించి
కదలించి నా ఉనికి చెదరేన సఖుడ!

కన్నీటి ముత్యాల కురిసిపోనీ వోయి
దాచుకున్న, ఎడద ఓపలేని బరువోయి
వ్యథలు దాచిన, మనికె బరువైపోద
నా చెంత చేర్చిన, చింతలె చెదిరిపోవ?

మనికి ఏనాడు, మనకి పున్నమి కానేలేదు
నిండు చంద్రుని కరుణ కురిసిపోలేదు
గ్రీష్మ తాపాలు బెదిరింప, చెదిరిపోలేదు
మరి ఈవేళ కనుదోయి తడియారదేమి?

## నీ అడుగు...

నీ అడుగు సవ్వడులు
సుమబాల ఎద పుప్పొడులుగ
నా చేయంది, నడిచేవ సఖుడు
మన చెలిమి వికసించి పులకింప ఈ వేళ.

నీకేలు నేసంద, నా ఎద ఝల్లుమన
రాగరంజితమోయి తనువు
పూలపల్లకి కాద మనసు
విరిసె, పరవశాన మది ఇంద్రధనస్సు

నీ కనుల నీలిమ కరగేన నా చూపు
నా చెక్కిలి కెంపుల వెలిగేన నీ వలపు
రంగురంగుల కలయిక ఈనాటి ఈ తలపు
కనుగవ కలయగ, కలల కలగలుపు.

## నీ ఛాయనై....

ఎలుగెత్తి పిలిచేన ఎలతేటి చెలుడు
వెలుగు మలుపున దాగి వలపించుసఖుడు
మసక చీకటి ముసుగు మరి తొలగిపోవ
వెన్నెలలే జగమంత వెల్లువై కురియ

మూగవోయిన మనసు మురిసి పలికేన
మోహనరాగమై ఎదలోన మ్రోగేన
మురళిరవళించి, మధువులొలికించి
ఈ సుప్త హృదయాన్ని మేలుకొలిపేన!

వాయులీనమైన మమత వాహినిగ ప్రవహించి
వీణ మీటినటుల నా ఎదను పలికించి
ప్రణయ భావనలు తాము ప్రణవమై ప్రభవించి
ప్రకృతి తానె నేనుగ పులకించిపోయేన!

నింగి దోగాడు నీలిమబ్బుల చెలుడ
నేటి నీ పలుకు మధువుగ కురిసేన
కురిసి, పుడమోవులకించి నర్తింప
ఆచరణ కింకణులుగ నా ఎడద మ్రోగేన!

రేకు రేకున విరియు, వలపు బరువున సోలి
అరుమోడ్పుకనుల, కలలదారి సాగి
నీ దరికి చేరేన, బ్రతుకంత వేచి
నీ హృదిలో దాగేన నీ ఛాయగామారి!!

# అర్పణ...

కన్నీటి నీ వాకిట కళ్లాపుజల్లి
కలల రంగవల్లులన్నా నీ ముంగిట తీర్చి
దోసిళ్లతో నాదు కోర్కెల పూలు చేర్చి
నీ పూజకై నేను కదలి వచ్చినవేళ
ఆలయము మూసి ఆదరింపవదేమి?

ఎదయె నీ ధ్యానమై మారుమ్రోగేవేళ
నీ గర్భగుడిని వెలిగింపనివేమి?
చీకట్ల దాగిన, కనుపింపవని తలతువేమి

నీ తలపు వెలుగుల మరి చీకట్లు లేవోయి
నీడలు లేని నీ స్నేహం వెలుగులో
నీలోన కరిగిపోవ కర్పూరమువేగాన!

# ప్రణవమై.....

పెదవి వంపున దాగు పిలుపు
వెలువరించిన పృథివి మ్రోగద
గగన పరిధిని దాటి ఎగసి
నీ ఎడదలోపల ఒదిగిపోద!

ఒదిగి ఒదిగి, ప్రతిధ్వనించీ
విశ్వమంతా వీనులుగ మార్చి
ప్రణవమై నినదించెనయ్యా
ప్రణయమూర్తీ వినవదేమి?

కదలిరావని కరుణమూర్తీ
కనులు వేచెను, కలత చెందెను
కరగి నీ పదకనులముల తడిపి
కలసిపోయేను నీ పదగజమునరసి!!

## తలపు వాకిట.....

తలపు వాకిట నిలచి
వలపు తలుపులు తెరచి
పిలిచేటి ఓ చెలుడ
నీ నెలవు ఏదోయీ?
అలనాడు కలలోన
చెలియనేనని తెలిపి
కనుల వెన్నెల నింపి
చెలిమి నాకేలంది
తొలిపోయెదవేమి
ఇలనేడు కలత నింపి?

# ఎద పిలుపు.....

నీ ఎద పిలుపు నా హృదిన పలికేన
కదలిరమ్మని, నన్ను బదులు ఇమ్మని
కరగిపోయెద సఖుడ, నీ వలపు పిలుపులో
కదలిరాబోన నేను నీ కలలదారులలో
కలువ కన్నెలు వికసించి,
 కనుగవను వెలిగించి
మనసు తలుపులు తెరచి
 మరుల నను బంధించి
నీ దరికి నేను చేర్చి
 రాగమై రవళించి
నాలోన కలిసేన
 నీ మమత పులకించి

నీలాల నింగిలో దాగున్న నీరూపు
నాలోని తలపుగా నిగిడేన విరితూపు
కనుపాప కదలికన కలిసేన మన చూపు
తొలిపొద్దు కిరణాల వెలిగేన ఈ మాపు!!

## తలపు మలుపున.....

నేల రాలెడు పూలను ఏరనేరగలేను
కదలిపోయెడు కలల కనుల దాచగలేను
చెదరి జారెడు తలపుల పలుకున పొదగలేను
ఎగసి పోయెడు అలల రూపు తెలియగలేను

సంధ్య తెలుపుల ఛాయ చీకట్లో కరిగే
చంద్రికలు వెదజల్లు జాబిల్లి దాగేన
మొయిల దారులు మూసి అనకల్లు ఒదిగేన
నిశి నేడు కదతనని అట్టే నిలిచేన!

నా తలపు మలుపులో దాగున్న చెలుడ
మబ్బుతెరల తొలగించి, నా వలపు చిగురించి
మలిగిపోయిన గతాల మరల వెలిగించి
కదలిరావోయి, తెలివెలుగు రేఖగా పయనించి!!

# సడిసేయకే గాలి...

గగనాల ఉయ్యాలలూగేటి ఓగాలి
సడిసేయకవేళ సంధ్యకురులు సవరించి
సఖుడు వచ్చేవేళ, చెలిమి తెలిపేవేళ
కొండకోనల దాగి జాబిలి వెలిగేవేళ
అరవిరియు విరజాజి రేకు రేకును తాకి
విరబోని కనుదోయి కలల కదిలించి
సిరిమల్లె సరసాల మురిసేటి ఎలతేటి
చిలిపి ఈలపాట మోసుకుని తెచ్చి
పలుకరించేవు నన్ను, అలవోకగా తాకి
తెలుపగలవా నాదు చెలుని రాక కబురు
వినిపింప వేచేవ విభుని విన్నపము
సడిసేయవలదన్న అలిగేవు కాబోలు.

## ప్రభూ....

నీ కాలిమువ్వలు నా ఎద నినదింప
నీ మోవి చిరునవ్వు నా బ్రతుకు వెలిగింప
నీ వేణు రవముల నా మనసు రవళింప
నీ పాద కమలాల నా మనికి నర్పింతు
తెలి వెలుగు రేఖలో నీవు పంపిన కబురు
మలి వెలుగు దారిలో నేను తెలిపిన బదులు
విని, కిలకిలా నవ్వేన ఈ పారిజాతాలు
జలజలా రాలేన నవ్వేటి కుసుమాలు
పెనవేయు మమతల కవి తలబ్రాలు
నీ చరణ కమలాల నా నయనాభిషేకాలు
నా బ్రతుకు పులకించు నీ మధుర గానాలు
వెన్నెలల కురిపించు నీదు దరహాసాలు!

# నీ చెలిమి....

చైతన్య లహరులు సౌందర్యపు సొంపులై
విభుతలపుల సిగ్గిలు కలికి చెక్కిలికెంపులై
మెరిసే ఈ సంధ్యవేళ నా మదిలో వలపులై
పూదోనెల జాలువారు తేటతేనె వాగులై

కలసేనా కనుచూపులు నీలికలువ మాలలై
విరిసేనా రేకు విప్పి తేటి చెలుని రాకకై
కదిలేనా చిరుపెదవులు తమ కథలను తెలుపగోరి
ఒలికేనా మధువులు పూబాలల ఎదలజారి

కనురెప్పల కదలికలో కదలాడే కలనేనై
కరగేన నీ భావన తొలిప్రాయపు అలనేనై
కదలాడే చిరుమబ్బుల తొలి చినుకును నేనై
కురిసేనా నీ మదిలో చెలిమి తెలుపు పలుకునై!!

# అమ్మ

పలుకులో పొంగి పొరలు మధువాహిని
తలపులో నిండి సొంపారు ప్రేమమూర్తి
మనసులో మమత పూయించిన మాతృమూర్తి
జన్మనిచ్చి, తీర్చిదిద్దిన దివ్యమూర్తి
వేయిజన్మల ఋణానుబంధం
కోటి బ్రతుకుల ప్రేమానుబంధం
కలలు నింపుకొని కన్న అనుబంధం
కరుణ నిండిన పంక్తుల కమనీయ కావ్యం
బాధలన్నిటి దాచి, మధువునే పంచి
కన్నీళ్లు దాచి, కథలు చెప్పి
కలతలన్నిటి దాచి, కలలు కననేర్చి
ఆవేదన సోకని, ఆర్ద్రత పంచి
వంచన తెలియని, మంచిని ప్రోవుచేసి
ఈ బ్రతుకునొక మధుభాండముగ నందించి
అనుభవాల దారిలో అడుగిడు సమయాన
ఆక్రోశ మెరుగకూడదని ఆశీస్సులిచ్చి
ఆనంద బాష్పాల మూర్ధమభిషేకించి
మురిసి, మురిసిపోవు కన్న తల్లి
ఈ విచిత్ర ప్రపంచాన వెలసిన కల్పవల్లి!!

# అన్వేషణ...

కడలి యంచున నిలచిన కాందిశీకుడు
కన్న కలలు విన్నబోయినపుడు
నిన్నలో కరిగిన ఆశల తలచుకొని
తన కోర్కెల మూటగట్టుకొని
పడవలో పయనించి, మరలరాకున్న
నమ్మించిన నేస్తానికై ఎదురు చూసి, చూసి
వమ్మైన నమ్మకాన్ని నమ్మలేక
అపనమ్మకంలో ఉండలేక
అనంతమైన సముద్రంలో
అదృశ్యమైన అదృష్టాన్ని వెతుక్కుంటూ
సాక్షులై నిలచిన నింగి, నేలలో
నిజాయితీ కోసం నిరీక్షించి
చివరికి, అచేతనతలో కరగిపోలేని
తన చైతన్యాన్నే ద్వేషించి,
కడలి అంచు కూలిపోగా
కడలిలో కలిసిపోయాడు
అనంతమైన ఆత్మ మాత్రం
నమ్మలేని నిజాలను ఆకళించుకోలేక
ఇంకా తెలుసుకోవాలన్న ఆత్రుతలో
రేగిన ప్రతి కెరటంలోనూ
తానూ పునరుజ్జీవించి
ఇంకా అన్వేషిస్తూనే ఉంది-
ఆ అన్వేషణ ఆ చంద్రార్కం
సాగుతూనే ఉంటుంది.

## పసిపాప...

పాలబుగ్గల, పసిడి నిగ్గుల బంగారుతల్లీ
లేత నవ్వులు కురియు వెన్నెలల చిన్నారితల్లీ
ముద్దుమాటల, మురిపెంపు మూటల వరాలతల్లీ
చిలిపి చేష్టల, తప్పటడుగుల చిట్టితల్లీ!
కలవారి కలిమిపంట
లేనివారి కలలపంట
కలిమిలేముల బేదమేలేని వరాలమూట
కలసిన రెండు మనసుల తీయనిపాట!

# ప్రతిధ్వనులు....

మదిలోన కదిలే భావాల
మమతల తంత్రులపై మీటి
స్పందించే మనసును పదాల బంధించి-
ఎన్ని కవితలల్లను? ఏ స్వరాన కూర్చను?
పెదవి కదిపిన, కదలి జారే పదాలు
శబ్దరూపాన, రూపాంతరాలు చెంది
చెదరిపోతే, భావన కరగిపోతుందేమో
అందుకే,
నిశ్శబ్ద స్వనాలు
గుండె లోతుల్లో నినదిస్తే
మనసుకు మనసే ప్రతిబింబమై
విశ్వమంతా వెలుగు కన్నెలు నర్తిస్తే
మరి భాష ఎందుకు?
పదాల ప్రకంపనల తాకిడికి
అలజడై, తడబడే పలుకులెందుకు?
అందుకే,
ఈ చిన్ని మనసున
కదలిపోయె
కరగిపోయె రాగాలు
నీ స్వరాలకు ప్రతిధ్వనులు కావు??

# కన్నీటి కరిగే కాలం.....

జరిగిపోయిన క్షణాలు మరిరావు, మరిరావు
కరగిపోయిన కలలు మరిలేవు, మరిలేవు.
మనసు విడిచిన మమత మనలేదు-
మమతలేని మనసు మనుగడేలేదు.
కరిగిపోయిన కాలాన్ని కొలువ, కన్నీరు చాలదు
కన్నీటితో కొలువ
కాలం విలువ చాలదు.
కొలువలేని విలువలనెంచి
విలువలేని కొలతల కాంచి,
విలసించలేక నవ్వింది నా మనసు
వెన్నెలలు లేని ఆ నవ్వుకి
కన్నీరు పొంగింది కనుదోయి నుండి
మనసులోని మార్దవం కరగి
కనుల నీలిమలో కలిసి
రెప్పమాటున దాగిపోయిన కన్నీటి బిందువు
ఉదయ సంధ్యలో
చిరుగాలికి కదలాడే గరిక చవుళ్లపై
నిలచిన తుహినకణంలా మెరిసింది
కన్నీటితో కాలాన్ని కొలవలేక
కొలవలేని కాలాన్ని గెలవలేక

**కనుల నిండిన బిందువు**

**కదలి జారక నిలవాలని**

**ఈ క్షణం కరగకూడదని**

**కరగిపోతున్న కాలాన్ని**

**కన్నీటితో అర్థిస్తున్నాను...**

('కాలాన్ని కన్నీటితో కొలవకు' శీర్షిక పోటీకి వ్రాసినది.)

## ఛాయనై.....

హృదయ సాగర మథనాన,
అనంత హాలహాల జ్వాల
ఎగసి ఎగసి, నలువైపుల
నన్నాక్రమించినవేళ
చెమ్మగిల్లిన కనుల తడి తప్ప
చల్లదనమే కరువైన అసురసంధ్యవేళ
ఆ జ్వాలనధిగమించి,
బ్రతుకు దివ్వెల వెలిగింపమంటావు
చుట్టు ముట్టిన చీకటిలో
చెదరిపోయిన కలలకాంతి
మెలకువరాలేని
గాఢ నిదుర భ్రాంతి
మనికినే ప్రశ్నించ
మరి నాకు దారేమి?
ఆశల చమురుపోసి,
అనుభవాల వత్తివేసి
పదిలంగా వెలిగించిన ప్రమిద
కొడిగట్టి రెపరెపలాడునాడు
గుండె పిడికిట దాచి
అండ చేర్చెడి విభునికై వేచి

వేచి, వేచి ఎన్నాళ్లని ఎదురు చూడను నేను?
విశ్వనాథుని వింత లీల యిది
ఈ లీలలో చిక్కిన ఛాయ మాత్రమే నేను
ఆ విభుని వెలుగులో నీడలే లేవట
మరి ఛాయనైన నేను ఎటుల సమసిపోయేను?

# మహాభినిష్క్రమణం

పసిడి పర్యంకాన పడతి పవళించె
ప్రాణనాథుని తలపుల చిరునగవు, మోము నలరించె
పసి నిసుగు పొత్తిళ్ల మైమరచి నిదురించె
కలల బరువున ఆ రేయి కనుమూసి తరియించె
స్వప్న సోపానాల నధిగమించిన స్వామి
చటుకున కనులిటు తెరచినాడదేమి?
తెరచిన ఆ కనుదోయి కమలాల
ఇదియేమి వింత, కన్నీరు తొణికినది!
కరుణ నిండిన కనులు కదలి వర్షించినవి
మదిలోన ఏ తలపు ఇంత దిగులు నింపె?
ఏడేడు జన్మలు నీ తోడు నేనని
కలసి నడచిన ఏడడుగులు మరచి
అడుగు ముందుకు వేసె, అయ్యో
అతివనొంటరిచేసి,
మూడు లోకాలు మురిసి దీవించగా
మూడు ముళ్ల బంధాన ముదిత ముడివడగ
ముడి విడదీసి వెడలిపోయెదవదేమి?
అవనిలోని ఆర్తి నిన్నంత ఆత్రపరచినదేమి
విశ్వజనుల కన్నీరు తుడువ వెడలిన స్వామి
నీ రాణి కనుల వరదకెక్కడ వారథి?
వేదనల వారింప వేవేగ పరుగులిడు తండ్రి
నీ పసి నిసుగు నొంటరిగ వదలి వెడలితివేమి?

# ఏ దారి వెదకెను?

చెదరి జారిన కన్నీటి ముత్యాల
దోసిట చేర్చి, సరాల కూర్చమంటావు
గరిక చివుళ్ల మెరిసే తుహిన కళాలతో
బ్రతుకు వాకిట రంగవల్లుల లరించమంటావు
సంధ్య చెరగు జారి, నును లేత కిరణాల
బాలభానుడా ముంగిట మెరసిననాడు
అలరారిన అందాలు అలికినట్లై,
తుహిన కళాలు జారి కరగిపోతే మరి
అస్తిత్వమే లేని ఆకృతులను
ఏ రూపురేఖల బంధించి మురిసేను?
చెదరిపోలేని మమతానుబంధాలు
తల్లడిల్లె తలపుల తడబాటు నడకల
ఏదారి వెదకెను? గుమ్మమెటుల చేరెను?

## తలపుల వెలుగులో......

ఆకాశాన అలరారు నక్షత్ర దీపాలు
అమావాస్య రాత్రిని అందంగా అలంకరిస్తే
నీ నిరీక్షణలో చీకటైన మనసున
నీ తలపు దీపాలు వెలిగినట్లుంది
వెలుగు నీడల మిశ్రమంలో
ఆరి వెలిగే వలపు తలపులు
గతస్మృతుల మాధుర్యాలు
కలసి, కరగి, కనుపాపల కౌగిలిస్తే
కదలి జారిన కన్నీటి బిందువు
చెక్కిట ముత్యమై నిలచి మెరిసింది
ఆ మెరుపు వెలుగులో నిన్న నేడై
నేటి నిజాలు నిన్నటి కలల ప్రతిబింబాలై
నిన్న నేడుల రాగజలధులు
భావబంధాలై ఎగసినవేళ
చిన్నబోనీకు నీ వింత మనసుని.
రేపు వచ్చే వెలుగు రేఖలు
తలుపు తట్టీ, మనసునంటీ
విశ్వమంతా వెలుగుమయమై
మనల కలిపి నింపివేయవూ!

# అనుబంధం...

నీ కళ్ల వెన్నెల వాకిళ్ల
మెరిసే కలల రంగవల్లులు
తీరిచి దిద్దిన చిత్రకారుని ఉనికి ఏది?
కదిలే రెప్పల తెప్పల పయనించి
ఆ దరి దాగిన చెలునికి కబురందించి
ఊసులు, ఎన్నో బాసలు కలబోసి,
ఊహల వాహిని ఊగిసలాడి
నీ తీయని భావన దోచిన చెలిమికి పేరేమి?
లయతప్పని జీవనగతికి
శ్రుతి కలిపిన మానస మురళికి
ఊపిరి సూదిన మోహనరవళికి
కదలాడే హృది పదజతులకి
స్పందన నందించిన బంధమేది?
మనసు మనసూ కలిసి విరిసి
మమత తేనెల నరసి, సొలసి
కాలవాహిని కలసిపోయే
కలల వెలుగుల కథనమేమి?

# కన్నీరు....

ఉబికుబికి పొర్లే కన్నీటి వెల్లువ తాకిడికి
ఉలికులికి పడిన కనురెప్ప రెపరెపలు
ఎగసెగసి రగిలే ఎదసొదల కదలికలు
కడలి గర్భాన మథియించు వ్యథలు
కడలి యంచు కరిగి నీరై
కడలిలోనే కలిసిపోతే
కలల లోకాలు వెలుగు మరచి
కలతలోనే మిగిలిపోతే
మనిషి బరువని, మనసు వ్యథయని
మమత అందని మనిషి వృథాయని
చిన్నబోయిన వెన్న మనసుని
కరుగనీయకు, కలత చెందకు
నిన్న నేడై, నేడు రేపై
నిన్న నేడుల రూపుమాపై
వెలుగు లేదని, వెతల బ్రతకని
చిన్నబోయిన మనసు, సేదతీర్చి
ఎదను చేర్చి, వెతల దీర్చి
చేరదీసిన చెలిమికలిమి
చేయి జాచి, అందుకొమ్మని
వేడుతున్నది వెలుగుద ఆరి..

## అలుక....

చిన్నబోయిన చెలియమోము
విన్నబోయెను విభునివిరహాన
కన్న కలలు విన్నపములై
పదమునంటేను పతికి మొరలై
చెలియదాపున వలపుదాచగ
చిలిపి చూపున మరులు రేపగ
మనసుకరగి, మధువనముగ
కలికి కదలె, పువులలతగ
అలిగిన మోము ఎరుపున
తొలగిన మొయిలు మెరుపుగ
వెలిగిన చిరునగవు కాంతిన
కలిగె నతని మది ప్రశాంతి

## మమతలు......

గుండె లోతులు కదలి
కంటి పాపలు అదరి
మింటి తారలు వెలిగి
కంటి నేడొక నిజము.

కలత పడినను చెదరిపోవక
వెతలు ముసిరిన బెదరిపోవక
వెలిగిపోవును నీడ సోకక
మమతలన్నవి ఇదియె సత్యము.

## నిష్క్రమణ...

కురిసి కురిసి కన్నీరు
నింగి నేలయు కలసి తడిసి
పృథివి కదలి కదలి కలసి
కరగి ఆకృతులు సమసిపోయె

రెప్పపాటున శ్వాస నిలిచి
కన్న కలలు చెదరిపోయి
'ఉన్న' నిజమే లేకపోయే
విన్నపములె మిగిలిపోయే!!

## ఎటుదారి?

ఎగసి ఎగసి విను వీధి కలసి
కురిసి కురిసి ఎద కరిగి
కనుదోయి అలసి, అలసి
కనుపాపల, కదలెలే కన్నీరు.

మనసు శ్రుతి చేసి
రాగలహరుల నూగి
కదలి నడుమ నావ వలె ఆగి
కదలి, కెరటాల నెదురీదలేక

అలముకొన్న చీకట్ల
వెలుగు కొరవై వెదకి,
వెదకి వెదకి అలసేనమది!

చుక్కాని లేని నావికుడ
ఏ తీరమేగెదవోయి, ఏది నీ తోడు నీడ
నిలకడ లేని కెరటాల తోడు
నిలువనీయని భావజలధి హోరు
తీరమెటుల చేరేవు? నావనెటుల చేర్చేవు?



## కాలం కదలి..

కలల కుంచెల చిత్రముల తీర్చి
స్మృతుల మధురిమ రంగులలది
కరగిపోయిన కాలమేదని
వెదకులాడెను చిన్ని మనసు!

బ్రతుకు పుటల మాటు దాగి
కలల అంచుల దోబూచులాడి
తొంగి చూచీ, పొంచి దాగీ
కలత పెట్టెను గతము తిరిగీ.

ఇదియె నిన్నని, ఇదియె నేడని
రేపు రూపు నీ వెరుగలేవని,
నిన్న నేడుల భావజలధిన
అలవు నీవై ఎగసి పొమ్మని
పలుకుతున్నది, వేదాంతమేదో
వినదేమి, నా చిన్ని మది మరి?

# ఆవేదన....

పిడికిట గుండెలో కడివెడు కన్నీరు దాచి
ఏనాడు తొణకలేదు, ఒక చినుకు చిలకలేదు
తృటిలోన మారిన జీవితపు మార్గాన్ని
ప్రశ్నించనే లేదు, పరితపించను లేదు

పరిఖిన్న మురళివోలె
పరితప్త భావాల దాచి
పలుకనేలేదు, వ్యథలు పంచనేలేదు
చిరునవ్వు మోవిపై చెరనేలేదు

మోహన రాగాన్ని ఆలపించెడు మురళి
శివరంజనిలోనె సేదదీరగ నేర్చి
మధురనాదాల మనసులు కరగింప
కరిగేన కన్నీరు, కనుదోయి కదలి!

చెలిమి గాలులు సోకి
చెలియ మనసును తాకి
కరగిన ఆవేదన మరి ఆగనేరున?
వెల్లువై, వరదయై, ఈ పుడమి తడిసేన?

# అలలు రేగి....

అలలు రేగిన అలజడిన, కల్లోలమైన కడలి
తీరాన్ని చేరలేని ఆ అలల కలవరపు జడి
పెనవేయు కలలన్ని విడలేని కనుదోయి
కనురెప్ప కదలికను కనలేని ఎదసడి

నిశివేళ నిలదీయు నిజజీవన సత్యాలు
నింగినంట గోరు నిలకడలేని కథనాలు
నీది – నాదను నిజము తెల్పు నిత్య సత్యాలు
మనదేది కాదను కటువైన భాష్యాలు

కదలి జారిన చెక్కిట ముత్యాలు
సరాల పొదగలేని సంతోష క్షణాలు
సరళ రాగగతిని పలుకలేని సంక్షోభాలు
అల్లకల్లోలమై, అలసేన హృదిలయలు

కనుగవను కదిలించి, కరిగించు మమతలు
కరిగి, నీరైపోవు, కన్నీటి గాథలు
చేయి జారిన ముత్యాల, ఏరనేరనియత్నాలు
ఒలికిపోయిన మధువుల వెదకులాడెను సుమాలు.

వలచి, వికసించి, పసివాడు మనసులు
వలచి, విడలేని, మమతైక మూర్తులు
విడిచి, మనలేని అసహాయభావాలు
మనికి కలగించి, మరి రాని గతాలు!

## ఎదసొదలు....

ఎదపొదరిల్లు నీ సొదల పువులు విరిసి
గుబులు గుబులగు సంధ్యవేళల మెరిసి
వెతలు వలదని నా జతను కలిసి
కథలు తెలిపెను నా మదిని అరసి.

సంధ్య వెలుగుల మోవితడిసి
వెదురు పొదలకు తగిలి రగిలి
మురళి రవళిగ మేళవించి
మురిసి నవ్వెను పరవశించి.

మేను తాకిన చిలిపి గాలి
మేళవించెను రాగలహరి
మేలమాడేను మొయిలు కురిసి
వలపు జల్లుల ఎదలు కలిసి.

## శ్రీరామ....

శ్రీ జానకీ మనోల్లాసకరం, శ్రీరాఘవం,
రఘుకుల తిలకం
సాకేత నివాసం, శబరీ హృదయ విహారం
సౌమిత్రి స్నేహాధారం, హనుమత్సేవిత పదం
భరత రాజేంద్ర సన్నుతం, దశరథ భాగ్యోపేతం
శతృఘ్నానందకరం, కౌసల్య జీవాధారం
భాష్పలోచన జటాయు సముద్ధరణం
పులకిత విభీషణ శరణాగతం
నిషాద సేవిత పదపంకజం
ముని వాల్మీకి సన్నుత చరణయుగం

## నమశ్శివాయ....

అఖిలాండకోటి జనమానసనాదం
నిఖిల విశ్వవ్యాపక ప్రణవనాదం
శివగౌరి లాస్య తరంగిణి ప్రమోదం
ప్రణయ మందాకినీ సలిల ధారావిలాసం
రామచంద్ర పూజితం, రామేశ్వర నివసితం
రావణాది సేవితం, దక్షయాగ నాశకం
ఓంకార నాదం, ప్రమథగాన కళాప్రపూర్ణం
సంధ్యాకాల శివతాండవ నృత్యఖేలనం
రవిచంద్రవహ్ని నయనత్రయం
త్రిశూలధారణం త్రిలోకపాలకం
వందే శివశంకరమ్, ఉమాపతిం భజామ్యహమ్.

# శివపాద నృత్యం....

శివపద మంటిన సిరిమువ్వ చెలగె
శివసతి పెదవిన చిరునవ్వు వెలిగె
హిమగిరి కరగిన హరివిల్లు విరిసె
పిడికిటి మనసున జగమెల్ల కలిసె
వెలిగెను ప్రమథుల సందెదివ్వెలు
మోగెను నందిగణాల డమరుకలు
మొరసెను సురగణ మృదంగములు
చెలగెను నటరాజ పదకింకిణులు
తకథిమి తకథిమి అని చెలగెను ధూర్జటి
తక ఝణు తక ఝణు అని లయ కలిపె పార్వతి
తథికిణ తోమ్మని అదిరెను హిమగిరి
ప్రణవము నిండీ, మురిసెను పృథివి...

# ఓం......!

శివపాద నృత్యాన చెదరి జారిన మువ్వ
గిరిరాజ తనయ చిరునవ్వు రవ్వయై
చెణకి రజతగిరి రవళించినవేళ
సంధ్య తరుణి చెక్కిలి రాగరంజితమై
అరుణ కిరణుడు తానలసి పడమరకుపోయె.
ప్రమథనాథులు సందె దివ్వెలు వెలిగింప
నందిగణాలు తమ ఢమరుకలు నినదింప
వీణ తీగెలు సవరించి వాణి శ్రుతికలుపంగ
విశ్వనాథుని నృత్యఖేలనల గిరిజ పులకించె.
పుడమిలో మనుజ హృదయాల కదలించి
విశ్వమంతా పిడికిటి మనసున నింపి
ప్రణవ నాదాన హృదయనాదాలు మేళవించి
ఓంకార స్వరూపాన, జగతి లయమైపోయె.

## ప్రథమ దృక్కు....

భృకుటి ముడివడి జటలు విడివడె
తృటిలో నిజగతి అడుగు తడబడె
ప్రమథనాథుని నిటల నేత్రము
ప్రథమ దృక్కుతొ మదను దునిమె
అష్టదిక్కులు అదిరి, బెదరగ
సృష్టి చిక్కుల కలగి చెదరగ
ఇక్షు చాపము విరిగి కూలగ
చకితమయ్యెను జగము సర్వము
గరళ కంఠుని కఠిన శాపము
నేలకూల్చెను మదనతాపము
దిశలమోగెను రతివిలాపము
అయ్యో, ఇదియే విధివిలాసము??

# నిటలాక్ష!

నిటలాక్ష నీ నయనత్రయమ్ము తెరువ
నిఖిల జగములు నేడు కల్లోలమవగ
కంపించసాగేను గగనమ్ములదిరి
ఎగసి కల్లోలమాయె కడలిచెదిరి!

ఏల క్రోధమ్ము ఏల ఈ తాపము
భగ్నమాయెనీవేళ ఇక్షు చాపము
ఛిన్నమాయెను జగతి, ఏల నీ పదతాడనము
ఇక చాలు శంకర, నీ రుద్రతాండవము.

జటకదలి, సురగంగ దుమికి పొంగేను
ఎద అదిరి, జగజ్జనని నీ జతను వదిలేను
ఇక ఆపు ధూర్జటీ, నీ జటిల నృత్యము
నీ సృష్టి తాళలేదీ కఠిన సత్యము!

# శివోహం.....

1. తాండవఖేల...

పృథివి పెదవి విప్పి, పిలిచెనీవేళ
వదలి రజతగిరి కదలి రావేమి?
చెదర తన అలుకలు నర్తించె శాంభవి
అదర నలుదెసలు ధర జారె జాహ్నవి.

నర్తింప నీ నొసట చిరుచెమటలలరి
అగ్నినేత్రము నేడు చల్లారిపోద
కరుణ వర్షింప నీ నయనత్రయమ్ము
ధరణి హర్షించి, తానె పులకించిపోద

చంద్రశేఖర నీజటలు విడివడగ
ఎందు దాగునయ్య ఈరేయి నెలరేడు
ఎదురుతెన్నులు చూచు కలువ కన్నెలు

2. కదలి కైలాసగిరి వదలి రావయ్య
ఎదలు కైవసమని నీదు పదమంటితిమయ్య
మదినప్రణవ నాదాలు మధురముగ నింపి
ఎదురు తెన్నులు చూచె మనుజలోకము.
నటనాన పదమెత్తు నీదు లాస్యాలు
జటజారు సురగంగ వింత విన్యాసాలు
తలయూచు శివమెత్తి ఫణిభూషణాలు

ఇలనూగు నాట్యాన సకల చరాచరాలు.
సృష్టి తరియించెనయ్య నీదు నాట్యాన
దృష్టికరుణతో నింపి నీవేగు సమయాన
కదలి కైలాసగిరి మరి వదలి రావయ్య
ఎదలు కైవసమని నీదు పదములంటితిమయ్య.

3. నీదు పదమంజీర నాదాలు నినదించి
నాదు ఎద బదులిడె రాగాల రవళించి
తుహిన గిరులు కరిగేన మహి ఎద అదరేన
అహరహము నీ మహిమ ఈ జగము పొగిడేన
ప్రణయ మందాకిని పరవశించేన
అణువణువు పులకించి ఎగసి దూకేన
ఘల్లుమనె అందియలు అంబ పాదాన
ఝల్లుమనె గుండియలు సాంబ నీ నృత్యాన
అలసేన నీదు పాదమ్ము నా తండ్రి
సొలసేవ నేడు నాట్యమ్ము చేసి
ఒకింత నావీట విశ్రమింపగ రమ్ము
కరమోడ్చి నీ కొరు వేచె సకలజగమ్ము.

4. పదకింకిణి నిక్వణాలు
చెలరేగగ నటనమాడు
ఇల నేలేడు వెతలు నేడు
తొలగిపోవగ నటనమాడు
నింగి నేలయు కలసి మెలసి

పొంగిపోవగ పరవశించి
అలలు ఎగసి జలధి కదలి
అవని ఊగగ, భువనమోహన నాట్యమాడు.
ఎదలసొదలు మృదంగాలై
ముదము మదిన తరంగాలై
జాలువారగ నయనధారలు
నేలజారగ గగన తారలు,
భువన మోహన నాట్యమాడు!!

5. కదలి కన్నియు నేడు కదలి నాట్యమాడె
వేదనిలయుడ నీవు వెడలి వచ్చినవేళ
గగనాలు పులకించి, భువనాలు తిలకించి
తనివార ఈ జగము, తరియించె చూడు!
సురగంగ చెలరేగ జగదంబ జతగూడ
సిరితోడ హరివచ్చి పదజతుల చేర్చ
విరిబోణి శర్వాణి వీణ పలికించ
నటరాజ నాట్యాన హిమనగము కరిగేన!

నెలవంక నర్తించి, ఫణిరాజు తలయూచి
అలివేని అలసి, పదకింకిణులు మొరసి
కైలాసమే నేడు, కదలిపోయెనదె చూడు
ఓంకారనాదాలు నినదించె నేడు!!

# అలపు తీరగ...

రేకు రేకున రేపటి రంగులలది
ఆకు ఆకున రాబోవు పసిమిదాచి
వేకువ వెలుగుల సరిచేసి, దారి చూపి
మా కొరకు రేయంత బడలితివదేవ!

గలగలలు పారు సెలయేటి సవ్వడులు
కలకలలు చెలరేగు శుకపికపు సందడులు
కిలకిలల నవ్వుల పసినిసుగు మురిపెములు
కలిపి కలబోసి, విశ్వమంతయు నింపి,
అలసి నీవీవేళ, యోగ నిద్ర పూనితివ
నీ పదకమలముల నా ఎదను నిలుపు
తలపు తలిరాకులేపనాల నలది
అలపు తీరగ నీ సేవల నే చేతు!!

# విశ్వేశ...

విశ్వరచన సయు విభుడవో నీవు
ఉచ్ఛ్వాస నిశ్వాస సారథివో నీవు
విశ్వేశ రేపగల్ల వారధివో నీవు
ఆశ్రయింపగ వేచు మాకు ఉపాధివో నీవు

వ్యవథి లేని మనుజ జీవితంపు జడిలోన
అవధిలేని కరుణ నింపేవు వొడిలోన
జలధి శయన, నీవు కనువిప్పి చూడ
తొలగి చీకట్లు, ఈ జగతి వెలిగిపోద!

కదలి రావయ్య గగనాల రేడ
కదలు నీ పద ధ్వనులు గాలుల మ్రోగంగ
వడలిన మోడులు మరల చిగురింప
బడలిన నా బ్రతుకు మరల పులకింప!!

# అభిషేకం...

నీలమేఘశ్యామ నీ మేను మీదుండి
పాలధారలవి వేదోక్తముగ పోయ
నీలి మేఘ మండలము దారి విడువంగ
నేల జారు వెన్నెలల వాగులుగ తోచె.

పసువు జవ్వాది కలబోసి నీకు నలుగిడ
మిసిమి ఛాయల నీ సతి మరింత మెరసేన
తొగరు దారాలు తాపిన నింగి మబ్బుగ నీవు తోచ
రాగమెరుగని నా మది రంజిల్లెనయ్య.

నీరదములోని నీలిమవు నీవై
నీరజనయన నీవు నిలచియుండ
జలజాసని నీ యురమున తానుండి
ఇల వాసుల నేడు కరుణతో చూచేన!!

# నడిరేయి...

ఏడేడు కొండలు దిగి వచ్చి నీవు
ఏలేవ నా స్వామి నీ ప్రాణసఖిని
రేయి గడచే వేళ నెలరేని వెలుగులో
దారంట పూచిన పూలన్ని నవ్వంగ,
సిరిమల్లె పిలువంగ, విరజాజి చెలి వచ్చి
పున్నాగ పూబోణి, పొన్నలను చేర్చి
వెన్నెలల నీ దారి, పాదాలు ఒత్తంగ
మెత్తమెత్తని తమరేకులని పరచి,
పరచి తమ ఎదల వలపులను కలబోసి,
అలమేలు మంగమ్మ కురులలో దాగి
చిక్కువడిన నీ కేలు చక్కదనము చూచి,
ఫక్కుమని నవ్వేన విరులన్ని నా స్వామి....

## అడుగడుగున....

ఒక్కొక్క శిఖరమే ఎక్కేన నేను
మొక్కులన్నీ తీర్చ వచ్చేన నేను
ఎక్కలేనయ్య తండ్రి ఎత్తుగా నిలచేవ
దిక్కుతోచక నిన్ను ఎలుగెత్తి పిలచేన!

కరుణ నిండిన కనుల కనవోయి స్వామి
అరుణ కాంతులు నిండె ఇక కనువిప్పవోయి
మలయ పవనుడేమొ మరిమరీ పిలచె
తెలియ నీదు కరుణ తరలిరావోయి.

అడుగడుగున ఎదురైన అలతి వెతలకే
బడలేనయ్యా మది కలత తీర్చవదేమి?
కడలియంచున నిలచి, అలలనే కాంచి
జడిసేను నా మనసు ఆర్తి తీర్చగ రావేమి??

## వసుదేవ సుతం....

చిన్ని తనయ, నీవు కన్ను విచ్చినవేళ
పొన్న పూవొకటి రేకువిచ్చి నటులాయె
వెన్నెల కిరణమొక్కటి నేలజారినట్లు
నీ కన్నతల్లి మోమున చిన్ని నవ్వు విరిసె.

కన్నతండ్రి, నీవు పొత్తిళ్ళ పవళింప
విన్నపములు వినెడి, వెన్నునిగతోచె.
పన్నగశయనమ్ము వీడి, పృథివి చేరగనీవు
వెన్నపాలన్ని వెల్లువలుగ పొంగె.
బోసినవ్వున నీవు బాలుడై ప్రభవింప
రాసిబోసిన ముత్యాలు రవలుగా మెరసె,
కేరింతలిడ నీవు, లోకములు భ్రమసి
మారాము చేయునిను, పసినిసుగుగనోదార్చె.

కటిక చీకట్లు కాటుక దిద్దంగ
అష్టమరేయిన అరుదెంచిన నీవు
నిండు పున్నమి చంద్రునిబోల
పండుగగమా బ్రతుకు పండిపోయినదోయి.
నీలమోహన నీరాకను తెలిసి,
నెమలి పురివిప్పె, మొయిలుకురిసె
మెరుపు తీగనవ్వి, మెలికలుగ
మొయిలురాజును చుట్టి మేలమాడె.

ప్రకృతి పరవశించు, నీ వదన సౌందర్యము
క్షణకాలమేన మాకు ప్రాప్తమ్మ?
ఏమి ఈ విధి లీల కరుణాలవాల,
ఇకమీద నీ ఉనికి, కాబోద రేపల్లె
కఠినమయిన ఈ కార్యము, నాదు భారమ్మ?
కన్నతల్లిని విడదీయు బాధనాదయ్య
మత్తు వదలని నీ తల్లి మైమరచియుండ
పొత్తిళ్ల నిను దీసి వేరుచేయవలెన?

లోకాలనేలేటి పరమాత్ముడవీవు
శోకాల తీర్చంగ అరుదెంచినావు
లోకమంతయు నవ్వుల పవ్వులు జల్లేన
నీ తల్లి కనుల కాటుకలు కరగేన?
రేపల్లె వేచె, బృందావనము వేచె,
ఆలమందలన్ని వేచె, ఆనంద భాష్పాల
గోపెమ్మవేచె, నీ మోవితాకంగ వంశియువేచె
వేచె జగమెల్ల నందగోపుని ముంగిట
ఇటదేవకి బతుకంత, వేదనతొ వేచె
ఒక కంట కన్నీరు ఒక మనసు చిలికె పన్నీరు
ఒక మది రోదించె, ఒక ఎద పులకించె
ఒక తండ్రి వేదన, ఒక తండ్రి ఆరాధన

ఒక్క నీవు, జగమెల్ల నీది
దేవకీ సుతుడవీవు, యశోదమ్మ కంటి
వెలుగీవు
వసుదేవు సుకృతమ్ము నీవు
నందగోపుని మమతాకృతివి నీవు
ఇద్దరు తల్లుల ముద్దు బాలుడవీవు
ఇద్దరు తండ్రుల పుణ్య ఫలము నీవు
ఎవ్వరివాడవు ఎవరికి చెందవు
ఎవరు కొలచిన, వారికె విభుడవ?
జగమునేలెడు స్వామి
జగతికే బాలుడవై
జగమెల్ల నీ లీలనాడించు
జగన్నాథ, నీవు వసుదేవ సుతుడవని
వసుధలో నాకు సాఫల్యమొసగితివ!

## సమర్పణ....

నీదు పాదము కడుగ, కడలి కదిలేనయ్య
కెరటాల కన్నీరు కడవలతో నింపి
అవని తన ఎదను విరిసిన అలరులు తెచ్చేనయ్యా
వెతల దారాన మమతల దండలల్లి,

ప్రకృతి తానర్పిత మయ్యేనయ్య
మనుజ హృదయాల కరుణ దీపాల వెలిగించి
సృష్టి రచియించి, నీ వలసితివ నా స్వామి
నా వీట ఒక క్షణము విశ్రమింపరావేమి?

కనుల దీపాలు వెలిగించి, కరముల జోడించి
వీనుల విందుగా నాదు కవితల వినిపించి
నీ సేవ చేయనా, నా బ్రతుకు పులకింప
నీ పదముల వ్రాలనా, నా మనికి తరియింప!

## పద్మ బాంధవుడు....

తొలి సంధ్యకు స్వాగతమీయ, మలిసంధ్య తప్పుకొన్నది. దినకరుని ఆహ్వానింప హిమకరుడు వేగిరపడుతున్నాడు. ఆ సమయంలో, కొలనులో ఏదో కలకలం! ముకుళిత పద్మాల రేకులొకటొకటే విచ్చుకుంటున్నాయి.....

తొలిరేకులో వలపు
మలిరేకులో వగవు
మరి మూడవదానిలో వెరవు
ఆ పద్మిని మనసు పలుభావాల కలగలుపు!
పిల్లతెమ్మెరలు పలుకరించుగాని
తెలిమబ్బులు తొంగి చూచుకొని,
తనలోని వలపు పొంగి పొరలు కాని,
బాల భానుడే కానరాడు!
అదే మ్రోగుచున్నది మంగళ తూర్యం
విననాయెను కోవెల ఘంటారావం
అరుదెంచెను కడకు సుప్రభాతం
చుంబించెను పద్మినిని
ప్రభాకరుని బంగరు కిరణం
ఆ పూవు చిన్ని బ్రతుకునకదే సాఫల్యం
తరతరాన తరగనిదా బాంధవ్యం
నిత్యనూతనమైనదా ప్రణయం
ప్రతిప్రభాతం వెలువరిస్తుందొక కావ్యం!!

## వాన...

నింగి నీలాల మబ్బుతునకలు
ఒకటితో ఒకటి సరాగమాడినట్లు
మెరుపు తీవల నవ్వులొలికించినటులు
ఉత్సాహం ఉరకెత్తి, ఉరిమి జడిపించినటులు
చక్కని ఈ సమయంలో
చల్లని వానతుంపర
ఎడతెగని భావపరంపర!
ఆకాశ మేలె రాజు
ఆర్భాటంతో బయలుదేరితో
మేఘరాజు వైతాళికుడై
మెరుపు కన్నియ నాట్యసుందరియై
ప్రభంజనుడు దీవనలీయ
వాన చినుకుల సేసలు జల్లి
అవని జనులకు తమ వైభవాన్ని చాట
అచ్చురలరుదెంచినటులు
నింగి, నేలను కలుపుతూ
ముత్యాల చినుకుల వాన
జలతారు మెరుపులవాన...

## బాస చేసి....

తలిరాకు తల్పాన నిదురించు పసిమొగ్గ
రెప్పలల్లార్చి కనుదోయి తెరచినదేమి
బాలభానుని నులివెచ్చని కిరణాల
నిదుర భామ కదలి తొలగిపోయినదేమి!
రేకు రేకున విచ్చిన తరుణ శోభలనిండి
మధుమాసమా యిదని, మురిసి నవ్వినదేమి
అరుణ కాంతులలోన, హృదయ కాంతిని నింపి
లోలోన వెలుగులో మెరిసి, విరిసినదేమి
ఆ తోటలోనికడుగిడిన తేటి చెలికాడు
తనవాడు కాలేదని తెలియని చెలియ
ముగ్ధ సౌందర్యాలు, మురిపంపు పరువాలు
కలిపి, కలబోసిన మమతానురాగాలు
చెలికాని చెలిమిలో చిలిపి ఊహలు రేప
తన మనసునర్పించి, ఒంటరిగ నిలిచింది.
తన చెలిమి కలిమిలో, మనసు విప్పిన పూవు
రేకు రేకున తన స్నేహంపు రంగులలది
జంటగా పూదోట కలసి మురిసేవేళ
వలపు వాగులలో సొలసి పరవశించేవేళ
అట్టే ఆగమని, మరలి వస్తానని
ఆమని మలుపులో కబురంపుతానని

బాస చేసి, మరి రాని చెలికాని తలపులో
వేచి వేచి, ఎన్నాళ్లు కన్నీళ్లు దాచి,
చిరునవ్వు చాటున చిన్ని మనసుని పొదిగి,
తోట చిన్న బోనీక, తన మనికి నిలిపి
రాని ఆమని పిలుపు, తలపు దాపుల రానీక
వచ్చిన వసంతాల తనవిగా తలచి
పసి ఛాయల విడిచి, ముగ్ధ మనసుని దాచి
పసిడి రంగుల తోట మెరుపులో కలసిపోయింది...

## ఉషస్సు....

నీలిమబ్బులు మెలమెల్లగ విచ్చిపోయి
తెలిమబ్బు తెల్లదనాలు నింగిని నింపేవేళ
నిన్న రాత్రి కురిసిన అమృతపు ఝల్లుకి తడిచిన
పచ్చని గరిక చివుళ్ళు, నులివెచ్చని కిరణాలకై ఆత్రపడేవేళ
ప్రకృతి కాంత ఫాలభాగాన సింధూరం మెరిసింది
బాలభానుని బంగరు కిరణాలతో
పూల బాలలపై నీటి ముత్యాలలో,
హరివిల్లు మెరిపించి,
ప్రాతర్మందానిలంతో అవని జనులనలరిస్తూ
కొండకోనలలోని చీకట్లు చీలుస్తూ
వాడవాడలా ప్రభాతాన్ని చాటిస్తూ
మెల్లగా, అతి మెల్లగా అరుదెంచుతున్నదీ ఉదయ సంధ్య
ఈ ఉషస్సు అందాలు
బ్రతుకు బరువునెరుగని పసినిసుగు నవ్వులో
మధురోహల మూర్తి ముగ్ధమందహాసంలో
కన్నీట తడిచి పునీతమైన మనస్సులో
కలల బరువున సోలే నీలి కన్నులలో
స్వప్న జగతికి రాజు కవిరాజు పలుకులో
ప్రతిఫలించి, ప్రకృతిని పరవశింపజేస్తున్నాయి.
ఇది

ప్రగతిలో పయనించే పాంథులకి శుభోదయం
కటిక చీకటిని తరిమి వెలువడిన అరుణోదయం
మది నిండిన భావాల వెలువరించగోరు కవి మృదు హృదయం
ప్రతి ఉషస్సు రేకెత్తించు అనుభూతి అతి మధురం.

## అమావాస్య రాత్రి...

మనిషి భరించలేనిది చీకటి–
మనసును మూసివేసే చీకటి–
మనుగడని కబళించే చీకటి–
అమావాస్యపై ఎందుకింత కినుక?
బహుశః తనలోని చీకటిని బయట చూడలేక
చూసి, ఆ చీకటిని భరించలేక
తనలోకి తాను చూసుకు నిలువలేక
అమావాస్య అంటే అయిష్టతేమో!
కాని,
అరుణార్కుడలసి, అస్త్రాద్రి చేరువేళ
నీలాల నింగిన చీకట్లు అలముకొన్నవేళ
నిశాకాంత నల్లని కురులలో చిక్కుపడి
నక్షత్రాల మల్లెలు మెరిసేవేళ
చీకట్లోని అందాలు పొదగడానికి
చాలవు అక్షరాలు.
వెలుగులో మరుగుపడే అందాలు
నిశ్శబ్ద నిశీధిలో వినపడే స్వరాలు
కనులకు దోపక, వీనులకు వినపడక
కేవలం మనసుని స్పృశిస్తాయి.
నేలపైని ఒక్కొక్క జీవితం
నింగిలోని ఒక్కొక్క నక్షత్రమై భాసిస్తూ
ఒక కోణంలో వెలిగి, ఇంకొక క్షణంలో మలిగి
వెలుగు నీడల మిశ్రమంలో
వెలిగి ఆరుతూన్న జీవితాలు!!

# ఎర్ర గులాబి...

చిలిపి భాస్కరుని కిరణాలు
ఉదయ సంధ్యతో సరాగమాడితే
ఆకాశం అరుణ రాగరంజితమైనవేళ...
నా చిన్ని తోటలో ఒక గులాబి మొక్క
ఆ మొక్కన పూసిన చిన్న గులాబి!
రెండు చివురాటుకుల పరిష్వంగంలో
చక్కని చిన్ని ఎర్ర గులాబి!
రెండు పచ్చల మధ్యని పగడమై
అరుణ కిరణాలనపహసించే ఎర్రగులాబి!
ఆ ఎరుపు–
ఏ ముగ్ధ సిగ్గిలినపుడు
చెక్కిలి తడిపిన అరుణిమయో!
ఏ స్నిగ్ధహాసం ఒలికినప్పుడు
మెరుపులా మెరిసిన మోవియో
ఏ పొత్తిళ్ల పసినిసుగు ఎరుపో
ఏ చంద్రోదయపు తొలి వెలుగో....

## పంజరపు బ్రతుకు....

వినీలాకాశంలో విచిత్రమయిన పయనం
సాగిస్తున్నదొక చిన్ని, చక్కని శుకం
దాని పలుకుల పసిడి ఛాయలున్నాయి
దాని బ్రతుకున పచ్చతోరణాలున్నాయి.
బ్రతుకులో స్వేచ్ఛాప్రమోదాలే కాని
పర్జన్య గర్జనల చవిచూడలేదు
ప్రకృతిలో పచ్చని చివుళ్లే కాని
కంటకాల బాధ కలనైన ఎరుగలేదు
నీలిమబ్బుల తొలకరేకాని
బీభత్స ప్రళయాలు కాంచలేదు
తొలి కిరణాల నులివెచ్చదనమే కాని
చండ కిరణుని తీక్షణ తలపలేదు
కాని
ఆనాటితో ముగిసింది దాని సుఖజీవనం
ఇక నోచలేదది స్వేచ్ఛావిహారం
ఎగిరే రెక్కలు విరిగాయి దాస్యంలో
దీని బ్రతుకు వాడింది పంజరంలో
మనిషిలో కరుణకన్న కార్పణ్యం ఎక్కువని
తన స్వేచ్ఛ అతని కాటంకమని
తెలిసిన ఆ చిలుక వణికింది భీతితో

స్వేచ్ఛలో తేనెలొలికిన పలుకులు
బంధనాన మూగవోయినవయ్యో
చుక్కలనంటు పయనాలు
దిక్కులేక పంజరాన ఆగిపోయాయి
విలపించి, విలపించి సోలిపోయిన చిలుక
మరణాన తన స్వేచ్ఛ తిరిగి పొందినది!!

## మమత....

నీలాకాశపు నిట్టూర్పు వేడిలో
వడలిన రెల్లుపూయెదలో
మరులు రేపి, మరల ఆమని తెచ్చి
సేదతీర్చిన గాలి చెలుని ఉనికి ఏది?
రూపునెరుగని మమతల మూర్తియతడు
రూపుకోరని మార్దవపు మొలక ఆమె
రూపుదిద్దుకొన్న భావనా మాధురీ ఝరిలో
రూపమేల ఆ బాంధవ్య మధురిమలకు?
ఆత్మైక రూపమౌ అనురాగ జలధులు
ఎగసి కల్లోల పరిచే భావతరంగాలు
సెకత స్థలి కలసి కరిగిపోయే తలపు నురగలు
జీవితం లోతులు విరిసి కలసిపోయిన మెరుగులు...

# సమత....

కడలి అలలు కలసి మెలసి
పుడమి అంచును తగిలి కరిగె
కరగి, రగిలీ, కలల కలసి
తిరిగి తలపు తలుపు తెరిచె.
వెలుగు పుంతల బతుకు గడిపి
కలత చెదర కథలు తెలిపి
కలలు కనగ కవిత కథగ
వెతలు మరచి సుధల చిలికె.
మమత పెరిగి, సమత కుదిరి
మనసు కలిపి మనిషి నిలిచి
అవని అవధి, గగన పరిధి
కలిపి నిలిపె, మనిషి ప్రగతి.

# విరిసేన నీ మదిని...

చిన్ని చిగురాకులలో చిరుగాలి పిలుపునై
పగడంపు నీ పెదవి, పలుకునై అలరారి
తేనె చినుకుగ మారి, తెలిమబ్బులో దాగి
కురిసి ఈవేళ నీ మనసులో మురిసేన!

మంచు తడిసిన తొలి వెలుగు రేఖనై
పసిమొగ్గ ఎడదలో విరిసేటి మెరుపునై
రేకురేకును దాగు పరువంపు సిగ్గునై
ఎలతేటి రాకకై ఎదురెదురు చూసేన!

కనుదోయి దాగేటి కలల కౌముదినై
నిశివేళ మెరిసేటి తొలి తార తళుకునై
నేల జారెడు తటిల్లతికలోని విరుపునై
విరిసేన నీ మదిని విరజాజి పూవునై!!

# గగనాలు ఒరిగి...

కదలి కురిసేనా కరుణ మేఘాలు
కదలి యంచుల నొరసి ఎగసేటి అలలుగా
కనుదోయి చిందించు కన్నీటి జాలుగా
కనుపాప తెరచాటు కదిలేటి గాథగా.

అవని అంచును తాక ఒరిగేన గగనాలు
గగనాలు తడవంగ ఎగసేన కెరటాలు
కెరటాల నెదిరింప, అలసేన చిరుమీలు

చిరుమీలనోదార్చ, శాంతించె కదలి హోరు
మరల ఆమని వచ్చేను పడిలేటి తోటకి
చిగురుటాకుల చీర మోడులు ధరియించి
చిరునవ్వు చిందేను మోవియంచున దాగి
తరుణ భావాల రేకెత్త కరుణ మేఘాలదోగాడి.

## ఆమని అరుదెంచె.....

చైత్రమాసపు చిలిపి పిలుపున
పల్లవించెను పుడమి మురిసి
కొమ్మకొమ్మా పులకరించి
రెమ్మ రెమ్మా రేకు విచ్చీ
మొగ్గ మొగ్గన సిగ్గు దాచి
పూలరేకుల వొదిగి నవ్వీ
వచ్చేనమ్మా చైత్రమాసము
తన చెలిమి పిలుపుల పుడమినింపీ.
మోవి వంపున వలపుదాచీ
చేరి, చెలుని తలపుదోచీ
కలల వెలుగుల కనులు తెరచీ
కలికి కొరకై కరము చాచి
వచ్చేనమ్మా చైత్రమాసము
తన చెలిమి పిలుపుల పుడమి నింపీ!!

## వెన్నెల పిలుపు....

పున్నాగ పలికేన పూదోట చెలులతో
పున్నమి వేళల వెన్నెల పిలుపు వినరేమని
మొయిలు దారిన దాగేన చెలుడు పంపిన పత్రము
వాయులీనమాయేన కలలు నింపిన చిత్రము.

విరజాజి నవ్వేన చిరుగాలి పిలుపునకు
మురిపాల రేకు విప్పి విరబూయు తలపులకు
చంద్రిక, అది జారేన నెలబాలు కబురుతో
డెందము బదులాడె తొలివలపు బరువుతో....

# వెన్నెల....

నెల బాలుని చిరునవ్వు దారుల
నేల జారిరి వెలుగు కన్నెలు
ఇలను చీకటికిక చోటు లేదని
తెలిపి నవ్విరి, వెన్నెలలు చిలికి.
అడవి లోపల, ఆకుమాటున
అవనియంచుల తెరలచాటున
పూవు పూవున పొంచి పొంచీ
కొమ్మ కొమ్మ తలను వంచీ
నేలజారిరి వెలుగు కన్నెలు
ఇలను ఇరులకు చోటు లేదని!!

## రాగాల దారిన....

గగన సీమల నేడు కదలాడు మేఘాలు
మనసు మాటున పొంచి తనరారు రాగాలు
పలుకు రూపాన వెలువడని భావాలు
తలపు దాపుల దాగున్న రూపాలు
వెలుగు పుంతలలోన అలరారు దీపాలు
జడిసి, చింతల తోన పోరాడు తిమిరాలు
గెలిచి, ఆ చీకట్ల తరిమాడు వెన్నెలలు
పిలిచి, నా మదిని స్పృశియంచు తెమ్మెరలు.

# రాసలీల...

వన్నె చిన్నెలా గోప కన్నెలు
వెన్న దొంగకి విన్నవించిన
చిన్న కోరిక యమున వినెన
వెన్నెలమ్మకి కబురు పంపెను
వినిపించె వేణురవాలు
కురిపించేన మధురసాలు
పులకించేన కిసలయాలు
తిలకించేన శుకపికాలు
రాసలీల సోయగాలు
రాజిల్లెనా యుగయుగాలు
వెదజల్లెన పరాగాలు
గోపాలుని సరాగాలు
జాలువారు తేనెసోన
నేలరాలు పూలవాన
మురళి మోగె మనసులోన
రాధ ఊగె పరవశాన

# రాధిక.....

మంచు తడిచిన గరిక చివుళ్ళనలవోకగా తాకి
పులకరించిన పదపల్లవముల తిలకింప
నా బ్రతుకు వాకిట రంగవల్లుల నర్తించిన
చరణ యుగము నీదని నా మనసెరింగినదోయి
వెదకెడి కన్నులలసి పోవంగ
వెన్నెల నిండిన నీ చూపు సేదదీర్చినదోయి
నీ చిరునవ్వు కిరణాల చల్లదనాన
మరుగు నా యెడద మరి వలపు నింపినదోయి
జగతి నేలెడు స్వామి, జగతి నిండిన స్వామి
రాధకడకు రాబోవ సమయమికలేదోయి?
మధురోహలే నాకు మనికంత నిండ
నీ జగతిలో రాధ, నిన్నటి తలపేనా యి?
మనసునెరిగిన సఖుడవు, మరి రావుకాబోలు
ఈ బ్రతుకునకిక ఇదియే నిజమగునేమొ!
నీ ఊహయె నా ఊపిరిగా
నీ తలపే నా బ్రతుకంత నింపి
కలల లోకాల కౌముదియె వెలుగుగా
పులకించిన యమున తరంగాల తేలి
మనసునంటిన మురళి రవళింపు మధురిమల
కరగిపోయెద నీ చెలియ రాధికనోయి.

# నీ చెలియ....

మోవినంటిన మురళి మురిసి నవ్వంగ
పెదవి వీడిన పలుకు ప్రణవనాదమ్మాయె
విశ్వమంతా నిండి వెలుగు కన్నెలు నర్తింప
పుడమి పులకించి వెన్నెలల వాగులాయె...
వంశి వీడని మోహనా నీ రాధమనసు
తెలియదయ్య నీకు మూగవోయినదట
మధురవీడి, రాధ సన్నిధి వీడి
చిన్ననాటి నీ చెలియనెడబాసి
దూరమేగితినని, నను గేలి చేసెదవేమొ
మనసు పొరల మాటున నీ సఖియ దాగినవోయి
కన్నులరమూపిన నీ కనురెప్ప చాటున
నిలచి నవ్వే నేను, నిన్నెడబాయనోయి.

## మాధవా....

మమతలు పొదిగిన ఈ పూపొదరింద్ల
మాధవా నీవెటు మరుగైతివోయి
పువ్వు పువ్వున నీ నవ్వు మోమును గన
రేకు విప్పిన నా మనసు రంజిల్లెనోయి
కనులు కలయగ కనురెప్ప బరువగును
పెదవి వణకి పలుకు భారమగును
పలుకలేని నా పరితప్త భావాల
పరిహసింపకు నీవు, నీ ప్రణయినిని నేనోయి
నీ చూపు తాకి నా మనసు ఝల్లనగ
నీ తలపు వాడికి నా తనువూగిపోవగ
తరుణ రాగ శోభల తలపెల్ల పులకింప
విరహిణిని నేనైతి, యమున చేరగ రార!



## వ్రేపల్లెలో....

చిన్ని నవ్వుల చిలిపి కృష్ణయ్య నీవని
వెన్న తినిపింప యశోదమ్మ వెదకుచున్నది
కన్నె గోపికల కనుల కాంతుల వెన్నెలయ్యా
కన్న మీయమ్మ కనుల వెలుగు ఏది?
నోరు తెరువ ఈరేడు భువనాలు కనిపించె
తల్లడిల్లిన కాళీయుడు విషము విడిచె
కృష్ణకృష్ణా యన్న గోపమ్మల భ్రాంతి సమసె
గిరిధారి నీ నీడ వ్రేపల్లె వెలిగె.
నంద గోపునియింట నందనమ్ము విరిసె
బృందావనమదెల్ల పులకించి మురిసె
నీ కనుల నీలిమలు యమునలో కలిసె
రాధ మనసున సిరివెన్నెలలు కురిసె.
ఎటకేగెనె స్వామి....
మురళి నందిన మోవి పగడాల రాశియై
రాధ చెక్కిలి కెంపు సంజాయలో కలసి
పసిడి వెల్లులు చింది, ప్రకృతి తానె పులకించి
కలికి కన్నుల వెన్నెల వెల్లువై విరిసె.
చెలియ నీ మోము ఈ వేళ చిన్నబోయినదేమి
విభుడు రాడని మనసు చిన్నబోయినదేమి
విశ్వమంతా వేచె వెన్నుని రాకకై

మరి సఖియ, ఈ పొదరిండ్లు మారుపల్కవదేమి?
వ్రేపల్లె వీడి, బృందావనిని వీడి
గోపమ్మల కొంగు సరిగంచులు వీడి
చెలియ రాధిక చెలిమి కలిమి వీడి
ఎటకేగెనే స్వామి, మరలిరాడదేమి??

## నిట్టూర్పు....!

మూగవోయనేల ఈ మురళి ఈవేళ
రాగధారల చిలికి, రంజిల్లువేళ
మోవి మూగవోయె, మురళి నిదురబోయె
రసమాధురుల నిండు రేయి చినబోయె
యమున సాగదాయె
రేయి ఆగదాయె, రాధ కనుల
రాబోవు నిదురకరువాయె
రేకు వీడిన మొగ్గ ఎడద బరువాయె
నీవు లేని నా బ్రతుకె చీకటాయె!
కనుల కలల నింపు కమనీయ మూర్తి
కనురెప్ప మలుపులో మరి దాగకోయి
నీవు చెంత లేని ఈ నిశి నిలచి
నను విసిగించి, వేధించునోయి!
బాస చేసి రాకున్న, పసివాడె నీ సుమము
పసిడి వెల్గుల వేళ నిశినీడలు ముసిరె
చంద్రికల తడిసి, మురిసి నవ్వెడు రేయి
నిట్టూర్పు వేడికి సొలసి వాడినదోయి.

# నల్లనయ్యా....

పెదవి పూచిన పారిజాతాలు, పాలవెన్నెల చిలుకరిస్తే
తెల్లబోయిన వెన్నెలమ్మ, వెదకుచున్నది వెన్నదొంగని
నీలిమబ్బుల నీడ దాగిన, నల్లనయ్య కానరాడని
రాధ కన్నుల నీలిమలో వెదకులాడెను అల్లరయ్యని
మనసు దాగిన మధుర మూర్తిని
మనసుకావల వెదుకబోతె
సపలమాయెన ఆ నిరీక్షణ
గమ్యమెరుగున ఆ అన్వేషణ?

## ఎటు దాగితివోయి....

నీలాల మబ్బు నీడలో
    నిలచి నవ్వే స్వామి
నా కలల దారిలో
    నడిచి రావదేమి?
నీరెండ కరిగేను
    నింగి చీకటి మూసేను
కనుదోయి అలసేను
    కన్నీరు చిందేను
చిరునవ్వు నవ్వేవు
    చిలిపి తలపు రేపేవు
వలపించి అంతలో
    మటుమాయమయేవు
ఒకసారి కనుపింప
    కనురెప్ప మూసేను
రెప్పమాటున నిన్ను
    దాచివేసెద నేను
ఎచట దాగెదవోయి
    నీ చెలియ నెడబాసి
ఇది తగదు నా స్వామి
    నీ సఖియ మమతల రాశి!!

# పలుకు ముత్యాలు.....

ఎదదోసిలిగ చేసి, నీ పలుకు ముత్యాలు చేర్చి
పదము పదమొక వలపు మెరుపుగ తీర్చి
సరాలనే కూర్చి, నీ దరికి చేర్చి,
సంతసింపన స్వామి, నీ సన్నిధి నే చేరి!

హరివిల్లు విరిసేన, ఎద వలపు కురిసి
సిరిమల్లె విరిసేన, నీ తలపు మెరిసి
పులకించి మురిసేన, నీ జతను అరసి
రగిలించి నాలోన, తొలివలపు ఎగసి!!

# రాధామాధవం.....

వెలుగుల రేడువు నీవై
వెన్నెల బొమ్మను నేనై
వెలిగే మధుర యామినిలో
కలసేమా యమునాతటిలో

కురిసే మమతల జల్లు
వెలిసే కలల హరివిల్లు
పిలిచేనా పిల్లనగ్రోవి
పలికేనా నీ రాధ మోవి

కలసిన కన్నుల త్రోవల
మెరిసే స్మృతుల దివ్వెలు
సెలవి జారిన చిరునవ్వులు
రాధ ఎద విరిసే పువ్వులు

# వెన్నదొంగ.....

జాలువారెలే తేనెసొనలు
కదలి ఊగెలే పూలబాలలు
కనులు కలసి, కలలు విరిసి
మురిసి నవ్వెనే ఈ జగము.

నిన్ను తలచి, నిన్ను మరచి
నేడు నీ దరి జతగ చేరి
సాగిపోయెద, తోడు నీడగ
ఆగిపోవద కాలమిటుల.

వెలిగె వెన్నెల కన్నులందు
కరగి పున్నమి వేళలందు
కన్నె రాధిక మదినిదాగే
వెన్నదొంగని వెదికినెందు?

# రాధమ్మ నవ్వేన....

చల్లగాలికి ఊగేటి రెల్లుపూయెదన
చల్ల తరచినట్లు ఈ కల్లోలమేమి?
తెల్లవారని రేయి తెలతెలబోయినట్లు
కల్లనింగిన మనసు వెలవెలబోయినట్లు!

అల్లనల్లన అరుదెంచు కాలియందియ ఘల్లన
నల్లనయ్య వచ్చేనని రాధ గుండియ ఝల్లన
రెల్లు పూపొద దాగి దోబూచులాడేన
ఆ పూల ఎదలోన రాగమై మ్రోగేన!

యమున, ఇది చూచి చిరునవ్వు నవ్వేన
ఇసుక తిన్నెలు తామూ పదమంటి పాడేన
రాసలీలవేళ రాజీవలోచనుని
బాగులన్నీ విని రాధమ్మ నవ్వేన!!

# చిగురాకు నేకాన!

చిరుగాలి వీవనకె ఊగూగిపోయేటి
చిగురాకు నేకాన చిరునగవుల స్వామి
చిలిపి ఊసుల నీవు గుసగుసలు పలుక
తలపు తలిరాకుల మిసమిసలు మిన్నంటె.

ఉసురుసురని గాలి నిట్టూర్చి వేచె
విసిగి వేసారిన మనసేమొ అలసె
కలసి నీతోటి మురిసేటి నిశివేళ
సొలసి విరహాన వెన్నెలలు వసివాడె.

అమవసగతమయి, మరల పున్నమి రాద
విరిసిన పూరేకుల సొగసులెగయ
అరసి నీ దరిచేర నీలికలువ కన్నియ
సరసి పులకింప నీ ప్రేమకురిసిపోద!!

## మోహనా......

ప్రతి పలుకు నీ పిలుపుగ
ప్రతి పూవూ నీ నవ్వుగ
ప్రతి మలుపు నీ తలపుగ
ప్రతి తలపు నీ వలపుగ
పూవు పూవన
    పులుగు పులుగున
రేయి పగలుగ
    తలపు వలపుగ
నీ నీడ కరగి
    నీ ఎడద నిలచి
నీవే నేనుగ పరవశించే
    నీ చెలియ రాధిక నేనేకాన!!

# నా పిల్లా...!

నిన్న రేతిరికాడ వానజల్లు కురిసినాది
వానసూత్తె, మనసులో నా పిల్ల మెరిసినాది
ఆ ఊసుతో నా గుండె తడిసినాది
ఏటికాడ రెల్లు పూవు ఊగూగి మురిసినాది
మొన్నోనాడు–
ఏటి దాపున ఒకింత కాసి సూసాను
ఏటి నీళ్ళకి నా సిలక ఎగిరి వచ్చింది
నను సూసి కాలిమువ్వలు ఘల్లుమన్నాయి
సిగ్గుతో సిలక మనసు ఝల్లుమన్నది
దాని సోకుని నా గుండె ఝల్లుమన్నాది
ఫక్కుమని నవ్వింది పొగడపూలు రాలంగ
గలగలా నవ్వింది సెలయేరు దూకంగ
కిలకిలా నవ్వింది యెన్నెల్లు కురియంగ
నను సూసి నవ్వింది నా మనసు మురియంగ
నవ్వి ననుసూసి, నా ముందె నడిసిపోయింది
ఆ యెనకె నా సూపు నన్నిడిసిపోయింది
నా మనసు దానిలో కలిసిపోయింది
మనసు లేని నేను ఏటికాడె నిలిసిపోయాను
ఈ పొద్దు గడిసి, మళ్లీ సెందురుడొస్తాడు
ఏటిలో కొత్త నీళ్లు ఎగిసెగిసి దూకుతాయి
నా పిల్ల నా కోసం ఎదికెదికి సూత్తుంది
నేను, నా పిల్ల ఎప్పటికి, ఎదురెదురుగ నిలిసిపోతాము
నిలిసి, కలిసి, నింగిలోకెగసిపోతాము....

# మావా.....!

సెందురుడు సుక్కలతో సెలిమి సేసినయేల
సల్లంగ గాలి మెల్లింగొస్తున్నయేల
సెలయేటికాడ యిసుకలో సడిలేని యేల
సెవిలోన సెప్పిన గుసగుసలు మర్సిపోకుంటి.
నీ వాడిన పలుకులె తలసి తలసి మురుసుకొంటి
నా సుట్టు సీకట్లె ముసురుకుంటున్నయి
సందె తల్లెమొ సక్కంగ సాగిపోయె
నిన్ను తలసిన నాకేమొ 'సోయి' లేకుంటె
సన్నంగ నేనెదొ పదమందుకొంటి
సరసంగ నీవేమొ నన్నొల్లనంటివి
దానికె నా మోము సిన్నబోయింది
నవ్వి నువ్వేమొ నన్నెక్కిరిస్తవి
'నువ్వు నవ్వితే సెంద్రుడె సిగ్గుపడేనంటివి
నీ సూపుకె నేనెమొ మొగ్గల్లె ఐతి
'సిగ్గెందుకె నీకు యెర్రిమొగమా'యంటివి
'నీకాడె నాకు సిగ్గంత మావా'యంటివి
సుక్కల సాచ్చిగ, సక్కని ఈ సెందురుని సాచ్చిగ
ఊగిసలాడేటి మొక్కల్ల సాచ్చిగ
బాససేసిన నీ సల్లని మనసుకి దాసినైతి.
పేమంటె అది యెటో సిత్రంగుంటది

ఏదేదో నీకెపుడు సెప్పాలనుంటది
నిను సూత్తె నాకేదొ సల్లంగ హాయిగుంటాది
సెప్దామంటె నా నోట పలుకె రాకుంటాది
నువ్వు నవ్వితె యెన్నెలొత్తంది నాకు
నువ్వు దాగుంటె మనసంత సీకటైపోతాది
ఇదంత సెప్దమంటె ఎట్లనో 'యిది'గుంటది.
మావా....!
"ఇదేమి పిచ్చే పిల్లా" అంటావా మావాఁ?
"పిచ్చి మావాఁ" అది నీ పిల్ల మనసంటాను
'మనసెంటే పిచ్చిపిల్లా' అనకుమావఁ
'మనసులేని మడిసి బతుకేటికి' సెప్పు మావాఁ!!

## వచ్చిందీ వాసంతం!

వచ్చిందీ వాసంతం విచ్చిందీ సింగారం
నీడ సూచి ఆగినాను మావాఁ
నన్నేలుకోర బంగారి మావఁ
నీడలోనే మేడకట్టి, తోడుతోనె గూడుకట్టి

బందమేసి లాగినావె పిల్లా
నన్నొల్లనంటే నేనూరుకోనె
పంతమేసి తుంపబోకు
సింగారి చిన్ని మనసు
ఓపలేదు నిన్నొదిలి
బంగారీ మనసు
నువ్వే నా తోడు నీడ ఇది నిజమొ మావఁ
కంటిపాప నదుగోయి, సందమామతోడు
వలచీ వచ్చినానోయి
కోతలింక చాలోయి
సింగారి నేలుకో రావోయి
నన్నేలుకోర బంగారి మావఁ
ఆకాశం అందుకొనె
వన్నెల సిరుసిగ్గులు
పైరగాలి ఓలలాడె
సుక్కలన్ని తోడు

నీ తోడునేనుంటా
సిన్నదాన సూడు
నిన్న నాకు నువ్వెవరు
నేడు నీకు అమ్మతోడు
నా మాట నమ్మె సింగారి చిన్నదాన
నన్ను బందమేసి లాగినావె పిల్లా

## రాధేయుని ఆవేదన....

మందాకిని వొడిన చందనపు పేటిక డోల
అందేమొ దోగాడె చందమామను బోలు
అందాలు చిందేటి పసిబాలుడెవడు?
రంగారు బంగారు మేని ఛాయలవాడు!
నాగి నేలెడు దినకరుని కిరణాల వెలుగు
ఉదయాద్రి మెరిపించు అరుణిమల జిలుగు
మధ్యాహ్న భాస్కరుని తేజంపు చురుకు
అస్తాద్రి చేరేటి ఆదిత్యుని మెరుపు
అన్నీ కలబోసి, తేజంపు రాశి చేసి
ఈనాడు, ఈ పేటిక బంధించిరేవరు?
తలిరాకు పొత్తిళ్ల మెత్తమెత్తగ పేర్చి
తమ్మిరేకుల సుతిమెత్తని పరుపు పరచి
చెమ్మగిల్లెడు కనుల మరిమరీ తుడిచి
అమ్మనయ్యు, కఠినాత్మనైతినని వగచి,
విధి చేతిలో విడిచె బాలుని విధిలేని కుంతి
విధాత విధమెరుగని అనాథగ, ఆ ఇంతి!!

గంగమ్మ వొడి ఉయ్యాల లూగి
నింగి మబ్బుల నీడ తోడుగా సాగి
ఏ దూరతీరాల గమ్యాల వెదుకాడి
మెల్లమెల్లగ సాగె చిన్ని బాలుని భావి...

చిగురాకు మనసున్న చిన్నతల్లి చూసేను
తొగరు దారమంటి పసివాని రాక
వొడి చేర్చి, మమతల గండి పేర్చి తాను
కన్నతల్లి కాకున్ననేమి, 'అమ్మ'గా నిలిచేను.

'రాధేయుని పిలచి మురిసినా, రాధమ్మ
కర్ణుడని అతని పేరు నిలిచిపోయేను
కవచకుండలముల మెరిసేటి బాలుడు
ప్రచండ భానునిగ శరము సంధింప
ద్రోణుడే జడిసి, విలువిద్య నేర్పనన
పరశురాముడె తాను శిష్యునిగ స్వీకరించె.

పృథివి నేలెడు శక్తి సాధించియు తాను
మదిని తొలగని ఆవేదనలు తోచ
కన్నతల్లి తననేల త్యజియించెననివగచి
రేపవలు దిగులుతో వెదుకాడె కర్ణుడు...

తల్లీ, నీ ప్రేమ నోచనేరని నేను
కల్లోలమగు మదిని ఓదార్చలేను
తనయుడనే నీకు, తప్పేమి నాది
వినవేల నీ బాలుని ఆర్తి నిండిన పిలుపు?

లేగదూడను దరిచేర్చు గోమాత నేడు
కూన కొరకు తపియించె పికము చూడు
పసిమొగ్గ వసివాడునని, ఆకు చెరగున దాచె
ఆ తోటలోని ప్రతి మొక్క నేడు.

నాదేమి నేరము, పేరైన ఇడలేదు
ఇంటి పేరును లేదు, ఇల తండ్రి పేరు లేదు
ఏది వారసత్వము నాది ఏది అభిజాత్యము
ఏ కులము నాదమ్మ ఎవరి వాడను నేను??

రాధేయుడని నన్ను లోకమ్ము పిలచేను
కాదు కాదని నా మనసు నను మందలించేను
మమతల రాశి కన్నతల్లి విడనాడ
గురుతేది నా మదికి, ఉనికేది నాకు?

పరులు కాదన్న మది దాచు మాతృమూర్తి
మనసు వేదన చెందనోదార్చు కరుణ మూర్తి
వొడి చేర్చి కాపాడు అమృతమూర్తి
మరి నన్నేల విడనాడె ఆ దయామూర్తి?

'విధి విధానమిటులన్న' వినదేమి నా మది
విధాత తలపున ఇదియేమి అపశృతి?
ఏ దారి వెదకేను, ఎటుల కలసేను
నా తల్లి కనుపింప ఎటుల తెలిసేను?

కనుల నీరు నింపనేరని వీరుడ నేను
కనుల నీరు దాచగలేని ధీరుడ నేను
మది కరగు ఆవేదన అవని నిండ
అమ్మకై వెతికేటి రాధేయుడ నేను..

## దోసలిపట్టి....

దోసిలిపట్టి నీ వాకిట నిలిచినవేళ
కాసింత కరుణ చూప నీవాలసించెదవేమి?
నీ దాపు నిలచి నను నే మరచినవేళ
నావైపు నీ చూపు మరలదదేమి?

అలసిన కనుదోయి కన్నీరు తొణికి
కడగి నీ పాదాల కరగినవేళ
మమన వాహినిగ ప్రవహించి నా స్వామి
బ్రతుకు పున్నమిగ దీవించ రావేమి?

విరిసిన పారిజాతాలు నీ మ్రోల నవ్వేను
పగడంపు తమ ఛాయ నీ మోవి నిలిపేను
నీ నవ్వు వెన్నెలలు చెలిమి చిలికేను
పులకించు ప్రకృతి తన్ను తా మరచేను!!

# మనసలసి..

మనసు పొరల దాగి మరులు గొల్పి చెలుడ
మమత వలదని నేడు మరుగైతివేల?
మరుమల్లె విరిసిన మలి సంధ్యలోన
మరచి నీ చెలిని మరలిపోతివదేల?

మమత మనసుకి వరమోయి,
మరచిపోయితివేమొ
మనికి మరుభూమియె
మమత చిలకనివేళ
వెన్నెలల, నీడలు వెదుకబోకోయి
పొన్న పూవంటి మనసు, విన్నబోనీకోయి
చిన్ననాటి చెలిమి చిగురాకువంటిది
వడగాడ్పు వీచేన, వాడిపోవుకదోయి
వెడలిపోయిన ఆమని మరలి రాదోయి
వదలిపోయిన గురుతుల చెదరిపోనీకోయి

కన్నీటి ముత్యాలు కదలి జారక ముందే
కనురెప్ప తాకిడికి కరగిపోవకముందే
ఎద చేర్చి సొదలన్నీ ఆలింపవోయి
మరుజన్మలోనైన మన్నింపవోయి.

# గేయకృతులు

## రతీ విలాపము

చెరుకు నింటి చెలుడ, చైత్రమది వచ్చేను
చిగురుటాకుల చెరగు చెట్లన్నీ వేసేను
పసిమొగ్గలవి చూడు రెప్పలల్లార్చి
రేకురేకుగ నేడు మేను విరిచేను.
కొమ్మమీది చిలుక కువకువలాడేను
గోరింక కనుగీట కన్నులవి వాల్చేను
చిలిపి జంటను చూచి గోరింట నవ్వేను
ఆ నవ్వు కిలకిలల పూలన్ని విరిసేను.
శిశిరమ్ము గడిచేను, విరహమ్ము ముగిసేను
నీ దరిని చేరంగ నా మనసు కోరేను.

కిసలయము పులకింప
సరసముగ తిలకింప
కొసరి, మావిచిగురు
కోయిల గొంతు సవరింప

చైత్రమది వచ్చేను
చెరుకువింటి చెలుడ
చెంత రతిని చేర్చి
చెలువములు చిందింప!!

చిత్రచిత్ర నాట్యాల
చిత్తమలరు లాస్యాల
ప్రకృతి స్పందించె
కనువిందు నందించె!

అటు చూడు నా సఖుడ
అదినయే హిమగిరి
గగనాలు అదరంగ
అది ఏమి అలజడి?

సతి నెడబాసి, శోకాన మునిగేన
ఆదిశంకరుడీవేళ, అతి దీనుడాయేన
అగ్ని సమసిన అంబను అహరహము తలపోయ
అతని విరహాగ్నికి గంగ తడియారేన!

నింగి దేవతలార
నిటలాక్షుడీవేళ
నిస్సహాయుడగుట
నే చూడలేను.
నిజసతి లేకున్న
నిర్వీర్యుడీశ్వరుడు
నిట్టూర్పు వేడిలో
కరిగె సర్వేశ్వరుడు.
విశ్వనాథుని విరహము

విశ్వమంతటికి శిశిరము
అది తొలగించి నేడు
మరల ఆమని తెందు.

బ్రహ్మాదిసురలార
బ్రహ్మాండములు వెదకి
మీదు మహిమలన్ని
కలబోసి చేర్చి
ఆదిదంపతుల ఎడబాటు సమసిపోవంగ
హైమవతిని నేడు, అర్పించతెందు.

జటిలమగు తపసులోన
తన్ను మరిచెను ధూర్జటి
మిన్నులన్నీ కన్నులిప్పి
కాంచెనతని కఠినాకృతి

సృష్టి తాళలేదతని మౌనము
కష్టమెంతయినను ప్రయత్నింతము
నాదు విభుని అసమశరము
తాకిన తపము కాద భంగము!

అని తలచి పలికిన రతీదేవి
పయనమాయెను రజతగిరికి
కందర్పుడెందము జంకినను వినక
తొందరలో తనకెదురగువిధినెరుంగక!

లలిత సుమ చాపము, నెక్కుపెట్టిన మరుని
కలికి ప్రేమ పాశము గిలిగింతలిడగ
స్నేహాన, గిరిరాజ తనయను వెదుకాడి
మోహమెరయగ, తన శరము సంధించె.

చిరుత వయసు నుండి
హరుని పూజించి
తన ప్రేమ తపసుగా
తన మనసునర్పించి

కరము జోడించి, శ్వాస బంధించి
అపర్ణయై తాను అర్పితమగు అంబ
చటుకున కను తెరచి, అంతలో అరమోడ్చ
వాలు చూపుల తుమ్మెదలు నిఖిలేశుని తాకె.

నవ వసంతపు తేరు
నవమన్మథుని పోరు
నవనవోన్మేషమగు రమణి తీరు
కలసి, శివుని మదిన రేపె హోరు.

చంద్రశేఖరు మనసు చేసిన
ఇంద్రజాల మదేమొ కాని
తపసు మరచి, తన్ను మరచి
చెంత చేరెను గిరిజనరసి.

సిగ్గుచాటున మొగ్గవోలె
బుగ్గమీద అరుణిమల నిగ్గుతోచ
కనులు వాల్చిన కాత్యాయని
కరము మోడ్చెను పతినగని.

అంతలోనే స్ఫురణ తెలిసి
భగ్నమాయెను యజ్ఞమని రోసి,
వహ్నినయనము విచ్చి చూసి,
తృటిలో కాల్చెనయ్యో,
మదనుడిక మసి!!

క్షణ కాల వ్యవధిలో జరిగిన ఘోరము
కనలేక మూర్ఛిల్లె రతీదేవి పాపము
కనుతెరచి అంతలో కడుదీనముగ
ముక్కంటి పదమంటి మొక్కుతూ పలికె.

ఆదిదేవ నీ జంట కలవంగ శ్రమపడ
మా జంట విడదీసి తిది నీకు తగున?
పతి లేని రతీదేవి బ్రతుకు సాగేన
సతి లేని నీ శోకమపుడే మరచేవ?

ఒంటరిగ రతీదేవి బ్రతుకు దుర్భరము
జంట విడిన నాకేల ఈ సొగసు నిర్భరము
కరుణించి, నా పతిని మరల నాకిడుము
కరుణ లేకున్న నను కూడ కావించు భస్మమ్ము.

మదనుడే లేకున్న నాకు మనికదేల?
మధుపము రాకున్న పూదోనెల మధువదేల?
మధుర భావాల మా జంట సమసిపోవంగ
మధుమాసమింక ఇలకు మరలివచ్చేన?

చిన్నారి గిరిబాల నీ చెలిమి కోర
కన్నీరు నాకేల కరుణాలవాల
చెలిలేని నీదు శోకమ్ము, నే తాళక
నా చెలుని నీ వలపు సమిధగా చేసేన?

ఇది తగదు నా స్వామి, నీవు కోపింప
మదనుడేపాటి, నీకెటుల సాటి?
నీదు చిరునగవుకై పూనింటి దొర నేడు
ప్రాణమే వీడి భస్మాల రాశియయ్యె చూడు!

రాగ రహితుడవీవు, అనురాగడోలల
ఊగేటి సమయాన, ఈ రౌద్రమేమి?
జగజ్జనని తోడుగ, జగములేలు స్వామి
విరి తూపుల నా విభుని కరుణించు నేడు

అని పలుకు రతీ సతి శోకమ్ము కాంచి
కరిగె పాషాణమ్ము, కదలె కైలాసమ్ము
కరిగి కన్నీరు చెరువాయె జాహ్నవి
కరుణ తొణకెడు కనుల ఓదార్చె శాంభవి
శాంతించె శంకరుడు

సకల భక్తవశంకరుడు
మదనునకు మరి జన్మనీయ
మధుమాసమే మరలివచ్చి
రతి కన్నుల నీరు తుడిచి
విలపించు ఆ సతి నొసట
కుంకుమ మరి దిద్ది
విశ్వమంతయు విరులనింపి
విశ్వేశుపాదాల విరిసిపోయె
విశాలాక్షి పదమంటి మురిసిపోయే!!

# రాముని ఎద రగిలినవేళ..

(మాయ లేడిని వేటాడి, తిరిగి వచ్చినవేళ – కుటీరాన సీత కనరాదు!)

కలికి నీ కనుల నను కాటుకగ దాల్చి
చిలిపి నీ నగవుల ననురాగడోలల నూపి
కలసిన మన ఎదల సిరివెన్నెలల కురిపించి
తలగిపోయితి వీ వేళ నన్నిటుల ఎడబాసి!

ఏవేళ నీ మోము కలత చెందినది లేదు
కరుణ కురియు కనుదోయి అలయనే లేదు
నాదు పదముల తాకు కరస్పర్శ తొలగనేలేదు
తరుణి ఈ వేళ మరి ఏల కానరావు?

నీ కోర్కె నీ దీర్ప కనక మృగము వేటాడ
మెరయు నీ కనుల కాంతి తలచి వేవేగచన
మరుగైన ఆ మృగము మాయలేడియైతోచ
ఆ మాయ ఛేదించి, నీ దాపు చనబోవ
కనుల కనిపింపవు, పలుకు బదులిడవు
నిను వెదకు నా మదిని సేద దీర్పగ రావు

ఎటకేగితివి సఖీ, నను వీడి నీవు
నీవు లేని నామనికి వెలితియెకాద
చెంత సీత లేని రాముడు మనగలడ
మరుగు నా ఎద ఈనాడు మరుభూమియే కాద!

పూపొదరిండ్ల దాగిన, నే కనుగొనన
సెలయేటి గలగలల నీ నవ్వులే వినన
కిలకిలల నీ చిలుక, పలుకదదేమి?
రామరామయన్న పిలుపు వినబడదేమి?

నీ వూగు పూడోల పరితప్తగాతోచె
నీ వేగు పూదారి మూగయై నిలచె
నీ చెంత పులకించు కిసలయమువాడే
నీ కురుల విరబూయు సిరిమల్లె వసివాడే!

'నిను వీడి నా స్వామి నేను మనలేనోయి
నీ చెంత లేని నీ సీత, సగము విరిసిన పూవోయి
అని పలికిన నా చెలియ, ఇది ఏమి వింత?
ఎంత వెదకినను కనరావు నా చెంత!

చైత్ర మాసపు విరులు
నిశ్చేతనములాయె
కదలిజారెడు మధుధార
పెదవి వెనకనె ఆగే
నీదు పదములు కానక
పున్నాగ చినబోయె
విరుల నొప్పింపక చెలీ
త్వరత్వరగ రావేమి?

తొలి సంధ్య మెరుపులో వెలిగేటి నీ మోము
కనరాక నేనే వేళ కనులు తెరువగలేను
అరునార్కుడలిగిన తొలి ప్రొద్దువోలె
నీవు లేకున్న నా ఎద చీకట్లు విడవులే!

సీత చిరునవ్వు సిరివెన్నెలే కాద
సీత లేని రాముని మనసు చీకటియే కాద
మెరుపు తీగే లేని కరిమబ్బునే గాన
కురిసి ఈవేళ, ఈ జగతి అలసేన!

ప్రియసఖి, నీవెటుల బెదరిపోయితివేమొ
ఏ అసురు మాయలో మరుగైతివేమొ
ఏ దిశల నే బోను, ఎటు నిన్ను వెదికేను
కలత చెందకు చెలీ, అని ఎటులూరడించేను?

'కుసుమ కోమలి నా తన యెందు దాగేను
నీచేతనిడి, నే నిశ్చింతుడనైతి
ఈనాడు నా తనయ కనుమరుగైనదేమి'
అని ప్రశ్నించు జనకునికి బదులేమి ఇత్తు?
కనుల నీరిడు నీ తల్లి కలత ఎటుల తీర్తు?

రాముడెంత ధీరుడెంత గంభీరుడు
అని తలచు లోకానికి, బదులేమి పల్కుదు
'మా అన్న ధీశాలి' అను సౌమిత్రి కనులకు
నా బాష్పములనెటు కనుపింపక దాతు?

నీవు లేని దినము యుగముగా తోచె
క్షణక్షణమొక దినముగా గడచె
పూవుపూవు నీ తీపి పలుకుకై వేచె
కొమ్మకొమ్మ తమ చెలియకై తలనూచె

నీదు పదకింకిణులు లేని, వాకిలి మూగవోయే
నీదు కరముల దిద్దని, రంగవల్లులు వెలసిపోయె
నా పూజకై నీవు కోయని విరులు ఈ వేళ
ఆకుల మాటునే దాగి విలపించిపోయె

ఏ గాలి నడుగను చెలీ నీ పోక
ఏ పూలనడుగను సఖీ నారాక!
మలిప్రొద్దు వేళ నీవు తిరిగి రాకున్న
సందె గాలులు నిట్టూర్చి, రాముని ఎదరగిలిపోద!

# విశ్వవిభుని విరహిణి

యశోధర!

మాయాదేవి: ఎక్కడివాడమ్మ ఈ జాబిల్లి తునక
ఇక్కడీ రాజ్యాన వెల్లివిరిసిన మొలక
నావొడి నింపిన నిండు చంద్రుడు వీడు
తునకయన్న నా తెలివిదేమి మెండు!
పసినిసుగు కాదమ్మ ప్రభవించు బాలుడు
శాక్యరాజ్యాకాశ ప్రవిమల భానుడు
అలనాడు నిదురలో తలపేదొ మెరసి
ఇలనాడు నిజములో వెలిగేన, అరసి
కలలోన శ్వేత కువలయము మెరసె
ఇలలోన కపిలవస్తు నీ రాకతో మెరిసె.

బృందం: యువరాజు తానన్న దర్పమే లేదు
రాజ భోగాలన్న కోర్కెయే లేదు
తన మనసు తెలిసేటి కలికికై వెదకేను
మమత పంచెడు మనసుకై అరసేను

మాయాదేవి: ఇతడు 'నా' సుతుడన్న అహమేల నాకు
ఇతడేదొ దైవాంశ మాయింట కలిగేను
విరించి పొరబడి ఈ పుడమి చేరేన
శ్రీనాథుడే లేక సిరితోడ వచ్చేన
ఆదిశంకరుడే అల కనికరించేన

ఇతడు తప్పక ఆ దివి నుండి దిగేన!
అతని సహచరిణి, ఈ దేశపు రాణి
సుకుమారియే కాదు సుగుణాల రాశి
ఆమెకై వెదకేము, ఎటులైన వెదకేము
కోలి రాజ్యపు పడతి మాకు తగిన రాణి!

బృందం: నీలి మబ్బుయంచున మెరిసేటి మెరుపువై
పాలవెన్నెల తేలి కలబోయు తెలుపువై
కొలనులో దోగాడు కలువ రేకుల విరుపువై
వెలలేని ముత్యాల సరపు వెలుగునై
మెరిసేటి ఓ వెలది, ఏది నీ ఉనికి
ఏ దేశపు రాణి, ఏ తోట విరిబోణి
మా గౌతముని మనసు దోచిన చినరాణి?

చెలుని మనసు చిరునామాయట
ప్రియుని ప్రేమ తన మనికియట
కోలివంశము తనయునికియట
యశోధర తన నిజనామమట!

సౌకుమార్యపు మేలిముసుగున,
దాగినది శౌర్యమేన
అతివ అలతి పదమందున
వెలికిరాని గాంభీర్యము
కలికి కనుల వెలుగులోన
కలసి మెరిసెడి మనోధైర్యము

భావి దాగిన విరహమ్మునకు
తన వివాహమే నాంది వాక్యము!
సిరులు నిండిన రాజవంశము
మరులు నింపిన మనోరాజ్యము
సఖుడే ఏలెడు ప్రణయ రాజ్యము
తానే నిండెనతని హృదయ కుంజము.

కలికి చెక్కిలి తాను కొనగోట తాక
చిలిపి నెలవంక ఆ చెక్కిలిని చేర
సిగ్గున తరుణి బుగ్గలను, దోసిటను దాచ
అరుణ రేఖ పొడమిన తొలి సంధ్యతోచె

తొలి మలి సంధ్యారుణిమలు
చెలియ మోమున దోగాడగ
చకితుడై, తానా వెలుగున,
మెరిసె గౌతముడు.

మధుమాసమే వచ్చి విరిసేన పూదోట
సుధకోసమని తిరిగేన అలతేటి
వధువు మోమునంటి విలెగేన తొలి మాట
కథ కాని కథక నిలిచేన ఎలపాట!

యశోధర: నా హృదయ పీఠాన నర్తించు నా స్వామి
నీ పదములీవేళ, ఇటు కందెనేమి?
నీ మృదు చరణాలు అలసిపోయినవేళ

నా మనోమందిరాన సేదదీరగదోయి!

సొలసిన నీ పదములొకింత నిలిపి
కలల దారులు విడిచి నిజము తెలిసి
ఇలలో నా చేయంది, శాక్యరాజ్యమునేల
అలవోకగా నీవు కదలిరావోయి.

నీ జతకూడిన యువరాణి నేను
నీ చంద్రికల తేలెడు కలువరాణిని నేను
నీ తోడు నడువగ నే వచ్చినాను
నా భావి నీ చేతికందించినాను.

మన వలపు వికసించి, ఫలియించువేళ
ప్రకృతియె పులకించి, తిలకించునోయి
పసినిసుగు పొత్తిళ్ల మైమరచువేళ
మన బ్రతుకే పండి తరియించునోయి.

బృందం: ప్రకృతి కాంత ఎద తొలకరి చిలికె
పుడమి వెన్నెల వాగుల పులకించిపోయె
చిన్ని రాహులు చిరునవ్వు వెలుగున
శాక్య రాజ్యము నిండు పున్నమిగ విరిసె.
తండ్రి గాంభీర్యము, తల్లి సొగసు
కలబోసి మలచిన పసినిసుగు కనరేమి
వాన చిరునగవు వెలుగులో
మన భావి విరిసి మురిసేన మరి మరీ!!

నేపథ్యం: పసిడి పల్యంకాన పడతి పవళించె
ప్రాణ నాథుని తలపుల చిరునగవు, మోమునలరించె
పసినిసుగు పొత్తిళ్ల మైమరచి నిదురించె
కలల బరువున ఆ రేయి కనుమూసి తరియించె
స్వప్న సోపానాల నధిగమించిన స్వామి
చటుకున కనులిటు తెరచినాడదేమి?
తెరచిన ఆ కనుదోయి కమలాల
ఇది ఏమి వింత, కన్నీరు తొణికినది?

కరుణ నిండిన కనులు, కదలి వర్షించినవి
మదిలోన ఏ తలపు ఇంత దిగులు నింపె
ఏడేడు జన్మల నీ తోడు నేనని
కలసి నడిచిన ఏడడుగులు మరచి,
అడుగు ముందుకు వేసి, అయ్యో, అతివనొంటరి చేసి!
మూడు లోకాలు మురిసి దీవించగా
మూడు ముళ్ల బంధాన ముదిత ముడివడగ
ముడి విడదీసి వెడలిపోయెదవేమి?
అవనిలోని ఆర్తి నిన్నంత ఆత్రపరచినదేమి
విశ్వజనుల కన్నీరు తుడువ వెడలిన స్వామి
నీ రాణి కనుల వరదకెక్కడ వారధి?
వేదనల వారింప వేవేగ చను తండ్రి
నీ పసి నిసుగు నొంటరిగ వదిలి వెడలితివేమి?

యశోధర: నను విరహిణి చేసి ఎటకేగితివి స్వామి
తొలి వెలుగుల ఈ ప్రొద్దు మరల చీకటైనదేమి
కనువిప్పి నే చూడ, నా చెంత కానరావదేమి
నీ చేయినంది శయనించిన శాంతి ఏమాయె?
నిన్న రాతిరి నీ స్నేహ మీవేళ ఎటుబోయే?

నను వీడి వెడలగ నీ మనసెటు తాళెనోయి
చెక్కిట చేర్చిన నీ చేయి వెచ్చదనమేది
నిదుర కలగిన నన్నోదార్చు చెలిమి ఏది
ఉలికిపడు నన్నొడి చేర్చు ఓరిమి ఏది?
ఈనాడు నను వీడి ఎటకేగితివోయి?

చిన్ని బాలుడేమొ ఎదమరచి నిదురించె
కనుతెరచిన వాని భావి ఏది నా స్వామి
ఆ పసినిసుగు భాగ్యాన నీ ఎడబాటేన తండ్రి
తండ్రి ఏడని ప్రశ్నించ, బాలునికి బదులేమి?

చిన్ని చినుకు రాలి విరిసెనయ్య ఈ మొగ్గ
రేకు విప్పక మున్నె తుంపబోయెదవేమి
గ్రీష్మ తాపమేల స్వామి, మలయ మారుతవేళ
రేకు విడకమున్నె రేకు రాలు నేల తండ్రి?
నీ కేల ఈ వేళ ఇంత కినుక మాపైన
కనుల నిండిన అశ్రుధారల చూపు మసకాయె
మది నిండు విషాదాన మనికె చెదరే నా స్వామి
ఏల నీ విచ్చు జీవితము నీవే కలచివేసితివి?

యశోధర: ప్రత్యూషమున నిన్ను పలుకరించెదనేను
తొలి ప్రభాతంపు తొలి వెలుగు రేఖగ
చిరునవ్వు లొలుకు నీ మోవి నే దాగి
చిన్ని నవ్వునై జగతి వెలుగు నింపెద.
కనులరమోడ్చిన, నీ కనుపాప వెలుగునై

నీ వేగు కలల దారుల కౌముదిని నేనై
విశ్వశాంతికై వెదకు, నీ బాట తోడునై
నడచి వచ్చెద స్వామి, నీ తోడు నీడనై

నను బాసిపోవలదు, ఆదమరచి నీ వెపుడు
నీ దారిన నేను ఆటంకమే కాను
నను నీ తోడుగ తోడ్కొనిపోవోయి
నిను వీడి నేనెటుల జీవింతునోయి.

పొరబడితి నేనని, ఇలువదిలి నీ వేగిన
జగమే కల్లయని నే తలతునోయి
నీవు నిండిన నా జగము కల్ల కాదు నా స్వామి
కాన నీ హృదయాన నను నిల్పుకోవోయి.

విశ్వమంతా నీవు వెదకేవు శాంతి
నీ చేయి వీడిన నాకేది ప్రశాంతి?
విశ్వమంతా కొలుచు విభుడవే నీవు
ఈ విశ్వ విభునికి విరహిణిని నేను!

ప్రియసఖుడ నిను వీడి నేనెటుల మిగిలేను
నీతోడ నేనేగ పసిబాలుడేమౌను?
జగతి కన్నీరు తుడువ నీవేగ నా స్వామి
నా కంటి కన్నీరు వరదలై పొంగేను.

ఏ అడవి దారుల దాగేను విశ్వశాంతి
నీ మదిన తోచని దదియేమి ప్రశాంతి?
తరచి నీలోన నీవు వెదుకవేమి
ఏ మూల దాగేను నీవు కోరు శాంతి?

నిన్న రాతిరి నేకాంచిన స్వప్నమే నిజమౌన
సన్యసించిన నీవు నీ రాణి నెరుగవట
చిన్ని బాలుడేమొ నీ కన్న నిసుగె కాదట
ఈ జగతిన నీవు నేనెవరన్న బోధయె నీదట!!

ఇది ఏమి వింత నా ప్రాణనాథ
నీ వుండియు నీ కొడుకేయనాథ?
ఇక నేనెవరి కెరిగింతు
అంతులేని ఈ వ్యథ?

యువరాణి నేనగుట, కనుల నీరు వలదట
రాజ్యవంశము మనదని, వెతల తావు లేదట
ఇంటి కోడలగాన, వ్యథ నా పెదవి దాటరాదట
రాచరికపు మర్యాద గడపదాటరాదట!

నిను బాసి నేనెటు నగుమోము దాల్తు
నవ్వు నీ తోడే నడచిపోయినదోయి
నగుమోము చూపనిది నా తల్లి కాదు
అని తలచు బాలునికి బదులేమి ఇత్తు?

చిన రాణి మారాజు మనసు కలచేనేమొ
ఇలువీడి ఆతడిటు వెడలిపోయేనొ యేమొ
పసిడి కలల మారాజు పరుషములు వినెనేమొ
నిశివేళనె తాను నీడ వదలి పోయె.

అని పరులు భావింప బదులేమి పల్కుదు
నిదుర మాయనే నన్ను మరచి సాగితివని
వెడలి వత్తునె సఖీ అన్నమాటె నే వినలేదని
నేరములు పల్కెన నా స్వామి నీపైన
నేరుగా, నేనేమి ఎరుగనని తెలిపేన?

నా సుతుడు ఏడన్న నీ తల్లి చూపు
ప్రశ్నయే అడుగని నీ తండ్రి దాపు
కలసి నన్నీవేళ కఠినముగ తలప
నేనేమి బదులిత్తు? ఎటుల నిజము తెల్పుదు??

నీకేలునేనంది సాగిపోయితినిన్నాళ్ళు
నీవేల నన్నిటు ఏకాకి చేసితివి
నీ రాణి నేనగుట ఇలు వీడలేనోయి
ఈ రాజ్యంపు భావి చిన్ని రాహులునిదోయి.

కాన నా మనసు నీవే గైకొనిపోవ
ఇటు రాయివోలె నే నిలిచిపోయితిని
రాణివాసము నాకేల నా రాజు లేకున్న
రేరాజు లేని గగనాన వెలుగేది?

ఇటుల తలచి తలచి, ఎన్ని యుగాలు గడిచె
కనుల వెలుగు నేడు చిన్న బాలుని నగవె
ఆ బాలుడీనాడు యువరాజు కాబోవ
మరల నీరాక మా కనుల వెలుగై తోచే.

తరచి తరచి వేచిన కనుదోయి అలసి,
ప్రాణనాథుని కనబోవ ఇది ఏమి వింత?
ననువీడి ఏగిన నా విభుడు కాడితడు
విశ్వమంతా కొలుచు విశ్వవిభుడే ఇతడు?

ఏమి ఆ వెలుగు, ఏమి ఆ కనుదోయి ప్రశాంతి
ఇతడెవరో నేనెరుగ, నా సఖుడు కాడితడు
జగమంతయు ఎరుగు, నేనెరుగనిది ఏమి?
నీవు, నేనన్న నా భ్రాంతి ఇది ఏమి?

స్వామి నీ పాదాల చిన్ని ఊపును కదోయి
ఇదిగో నీ చరణాల కర్పింతు ఈ బాలుని
యువరాజు కాడితడు నీ చరణ చారుడు
నీదు వారసత్వమె నీ తనయునకు
కాషాయవస్త్రమొ, కరముల భిక్షపాత్రయొ

నీవేది యొసగిన అదియె మా భాగ్యము
శాక్య రాజ్యము నేడు బౌద్ధ రాజ్యమెకాద!

'నా నాథుడని, నా చిన్ని బాలుడ'ని
వ్యామోహమే నాదు మది కలవరింప
అన్ని మోహముల దీర్చి, నీదు స్నేహమే పంచి
విశ్వవిభుడవై నీవు వెలుగొంద నా స్వామి
రాబోవు చరిత పుటలు నీ మహిమ వినుతింప
ఇతిహాసమే నిన్ను యుగపురుషుడని వివరింప
నీ విరహిణిగ నేను నిలచిపోయెదనోయి

మరి జన్మ లేని నీకు మరుజన్మలో నేను
సహచరిణి కాలేను, కాక మనలేను
కాని నీ ప్రతి ఛాయయైనట్టి
మన బాలు రాహులునికి నే తల్లినేనోయి
ఇది నిజము నా స్వామి, అలనాటి యశోద
మరల వకుళయై మరలి వచ్చేనట
అటులె నీ యశోధరను కారుణ్య భావాన
తిరిగి రాహులు కన్నతల్లిగ దీవించవోయి...

నీ బాట కెంధూళినే కలసిపోయి
నీ చరణ కమలాల నిలచిపోయెదనోయి.

# TUHINA KANAALU

UMA

